ఈనాడు
అమరావతి
కృష్ణా
శనివారం అక్టోబరు 19, 2024

వెలవెలబోయే... వెలుగులొచ్చే!




టిడ్కో గృహాల ప్రధాన రహదారి వెంట అలముకున్న అంధకారం



కూటమి అధికారంలోకి రాగానే వెలుగులు

గత తెదేపా ప్రభుత్వ హయాంలో పేదల కోసం గుడివాడలోని మల్లాయపాలెం వద్ద 9,812 టిడ్కో గృహాలు నిర్మించి దాదాపు పూర్తిచేసింది. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఇళ్లను పూర్తిగా పక్కన పెట్టింది. లబ్ధిదారులు, ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి రావడంతో 2023 జూన్ 8న మిగిలిన పనులు చేయకుండానే లబ్ధిదారులకు అందజేసింది. ఒక్క విద్యుత్తు స్తంభానికి కూడా బల్బులు బిగించలేదు. కరెంటు సదుపాయం లేక సుమారు 10 నెలలు లబ్ధిదారులు గృహాల్లో అంధకారంలో జీవనం సాగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుదీకరణ పనులు చేపట్టి టిడ్కో గృహ సముదాయంలో వీధులన్నింటికీ వెలుగులు నింపారిలా.. – ఈనాడు, కృష్ణా

ఇంద్రగిరికి.. నవశోభ







13.50 లక్షల మంది వచ్చారని అంచనా

హుండీలపై రూ.9 కోట్లకు పైగా ఆదాయం

ఈనాడు, అమరావతి
న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

దసరా ఉత్సవాలు, భవానీల దీక్షవిరమణ సందర్భంగా ఈఏడాది రికార్డుస్థాయిలో భక్తులు తరలివచ్చారు. ఈనెల 3 నుంచి 14 వరకు.. 12 రోజుల్లో ఏకంగా 13.50 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారని అంచనా వేశారు. మూలా నక్షత్రం స్థాయిలో రెండు లక్షలకుపైగా భక్తులు ఏకంగా మూడు రోజులు పోటెత్తారు. మూలానక్షత్రంతోపాటు విజయదశమి, ఆ మరుసటి రోజూ భారీగా భక్తులు తరలివచ్చారు. ఈసారి ఆలయానికి ఆదాయం కూడా భారీగా వచ్చింది. హుండీ ఆదాయమే.. రూ.9 కోట్ల వరకూ ఉంటుందని అంచనా.

ఆలయంలో 46 హుండీలు దసరాలో నిండిపోగా వాటిని బ్యాగ్‌లలో మూటకట్టి ఆలయ స్ట్రాంగ్‌రూమ్‌లో దాచారు. వాటిలో ఈనెల 16న 180 బ్యాగులను లెక్కించగా.. రూ.3.50 కోట్లు వచ్చాయి. ఈనెల 17న మిగిలిన 120 బ్యాగులను లెక్కించగా.. రూ.2.76 కోట్ల ఆదాయం వచ్చిది. ఇవికాక మరో 22 హుండీలు ప్రధాన ఆలయం పరిసరాల్లో లెక్కించాల్సినవి ఉన్నాయి. వీటిలో మరో రూ.2 కోట్లకుపైగా ఆదాయం ఉంటుందని భావిస్తున్నారు. సోమవారం ఈ హుండీలను లెక్కిస్తారు.

ఆదాయం అపూర్వం

దసరా రోజుల్లో ప్రతిరోజు హుండీలు నిండిపోతుండగా.. వాటిని భక్తుల దర్శనాలు రాత్రి వేళ నిలిపిన సమయంలో ఈవో, డిప్యూటీ ఈవో, ఏఈవో సమక్షంలో వీడియో తీస్తూ.. బ్యాగుల్లో నింపారు. అలా 12 రోజుల వేడుకల్లో 300 బ్యాగుల్లో డబ్బులు నింపి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు.

వజ్ర శోభితం

కనక దుర్గమ్మకు ఈసారి కానుకలు భారీగా వచ్చాయి. ఓ దాత ఏకంగా రూ.2.50 కోట్ల విలువైన వజ్రాలు పొదిగిన కిరీటాన్ని ఇచ్చారు. ఇవికాక ఇప్పటివరకూ లెక్కించిన హుండీల్లో 412 గ్రాముల బంగారం, 16 కిలోల వెండి వచ్చింది. ఇంకా లెక్కించాల్సిన 22 హుండీల్లోనూ బంగారు, వెండి కానుకలు భారీగానే ఉంటాయని అధికారులు అంచనా వేశారు.

లడ్డూ వైభవం

దుర్గగుడి చరిత్రలోనే తొలిసారి దసరాల్లో 27లక్షలకు పైగా లడ్డూలు అమ్మారు. ముందే లడ్డూ ప్రసాదం సిద్ధం చేసి ఉంచారు. విజయదశమి, తర్వాత రెండు రోజుల్లో ముందు జాగ్రత్తగా అందరికీ ప్రసాదం అందేలా ఒక్కో భక్తునికి ఐదు లడ్డూలను మాత్రమే ఇచ్చారు. ఈసారి ఆరు లడ్డూలు కలిపి ఒక ప్యాక్‌గా అమ్మడంతో పెద్దఎత్తున కొన్నారు.

అన్న ప్రసాదం

అమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తుల ఆకలి తీర్చేలా ప్రణాళిక, కార్యాచరణతో సాగారు. అత్యంత ప్రీతిపాత్రమైన అన్నప్రసాదం, అల్పాహారం ఇచ్చారు. రెండు లక్షల మందికిపైగా భక్తులకు అన్నప్రసాదం అందించారు. 3 లక్షలుపైగా మజ్జిగ ప్యాకెట్లు.. 14 వేల లీటర్ల వేడిపాలు అందించారు.

సుజలం సుఫలం

గతంలో ఎన్నడూ లేనివిధంగా మంచినీటి బాటిళ్లను పెద్దఎత్తున అందించారు. నిరుడు వరకూ కేవలం వాటర్ ప్యాకెట్లనే ఇచ్చేవాళ్లు. ఈసారి ఏకంగా పది రోజుల్లో 19.58 లక్షల వాటర్ బాటిళ్లను అందజేశారు. దీనిపై భక్తులు కూడా సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆరా తీసి.. అన్నీ కూర్చి

వేడుకల్లో ఇబ్బందులు ఏమున్నాయనేది భక్తుల నుంచే నేరుగా కనుక్కునేందుకు ఐవీఆర్ఎస్ ద్వారా నిత్యం వేల మందికి ఫోన్ చేసి తెలుసుకున్నారు. ఆ మేరకు సమస్యలను వెంటనే పరిష్కరించగలిగారు. సాంకేతికత మేళవించి భక్తుల సంఖ్యను లెక్కించారు.

వెలుగు తోరణం

ప్రకాశం బ్యారేజీ పక్కన కృష్ణా నది తీరం నుంచి లేజర్ షో ద్వారా.. ఇంద్రకీలాద్రిపై డిజిటల్ బొమ్మలు పడేలా చేస్తూ.. అమ్మవారి చరిత్రను చెప్పిన విధానం కూడా భక్తులను ఈసారి విశేషంగా ఆకట్టుకుంది. మరోవైపు నిత్యం కృష్ణమ్మకు హారతులు ఇవ్వగా భారీగా ప్రజలు తరలివచ్చి వీక్షించి తరించారు.

సమన్వయ ఫలం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ సత్యనారాయణ పర్యవేక్షణలో.. ఈవో రామారావు, అధికారులు రాత్రింబవళ్లు ఆలయ పరిసరాల్లోనే ఉండి.. సఫలీకృతం అయ్యారు. ప్రధానంగా కలెక్టర్ సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు.. నిత్య పర్యవేక్షణతో విజయవంతం చేయగలిగారు. గత పాలకుల వైఫల్యంతో వెలిసిపోయిన ఆలయాన్ని.. ఈసారి రంగులతో మెరిపించారు.

విశిష్ట సేవలు

రూ.500, రూ.300, రూ.100 టిక్కెట్ల విక్రయాలతో రూ.2.80 కోట్ల ఆదాయం వచ్చింది. 27 లక్షల లడ్డూలతో రూ.4.05 కోట్లు సమకూరింది. ప్రత్యేక కుంకుమార్చన పూజలతో ఆదాయం వచ్చింది.







డ్రోన్ సమ్మిట్‌కు ఏర్పాట్లు


ఏర్పాట్లపై చర్చిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం, విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్న డ్రోన్ సమ్మిట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లుగా నగర సీపీ రాజశేఖరబాబు పేర్కొన్నారు. డ్రోన్ సమ్మిట్ కార్యక్రమం జరిగే పున్నమి ఘాట్ ప్రాంతాన్ని ఆయన అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. రాజశేఖరబాబు మాట్లాడుతూ డ్రోన్ షోతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, అతిథులు, వీఐపీలు, ప్రజలు సౌకర్యవంతంగా తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీపీ కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీ, ఏసీపీ, సిబ్బంది పాల్గొన్నారు. డ్రోన్ షో ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలించారు. 5 వేల డ్రోన్‌లతో ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కె.చైతన్య, సిటీ ప్లానర్ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్) శబరిమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఐఆర్‌సీటీసీ 'భారత్ గౌరవ్' పేరుతో ప్రత్యేక రైలు నడపనుంది. మొత్తం 4 రాత్రులు, ఐదు పగళ్ల ప్యాకేజీతో ఈ రైలు నవంబరు 16న సికింద్రాబాద్‌లో బయలుదేరి పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు మీదుగా శబరిమల అయ్యప్ప, చోట్టనిక్కర దేవి ఆలయాలకు చేరనుంది. 20న తిరుగు ప్రయాణమవుతుంది. టీ, అల్పాహారం, భోజనం, ఏసీ, నాన్ ఏసీ రవాణా, ప్రయాణికులకు బీమాతో కలిపి టికెట్ ధర ఒక్కొక్కరికీ స్లీపర్ తరగతిలో రూ.11,475, థర్డ్ ఏసీలో రూ.18,790, సెకెండ్ ఏసీలో రూ.24,215గా నిర్ణయించారు. వివరాలకు ఫోన్ నంబర్లు 82879 32312, 92814 95848లో సంప్రదించవచ్చు.



తోపునన్నారు.. తోక ముడిచారు!

- ఇళ్ల నిర్మాణం చేపట్టలేక పలాయనం
- డ్వాక్రా రుణం రూ.9.80 కోట్లు స్వాహా
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే సంస్థ నిర్వాకం
- అయినా... విచారణ పేరిట కాలక్షేపమేనా?



ఈ చిత్రం చూశారా..? ఇవీ జగనన్న కాలనీ పేరుతో పేదలకు నిర్మిస్తున్న ఇళ్లు. జగన్ జమానాలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తానే పేదలకు ఇళ్లు కట్టిస్తానని ముందుకు వచ్చారు. ఉమ్మడి జిల్లాలో ఆయన సంస్థకు ఇళ్ల నిర్మాణం అప్పగించారు. విజయవాడ సెంట్రల్‌లో పల్లవానితిప్ప లేఔట్‌లో ఎమ్మెల్యే సంస్థకు నాలుగు వేల ఇళ్లను అప్పగించారు. నాలుగేళ్లు గడిచినా.. నేటికీ మొండి గోడలే ఉండటంతో లబ్ధిదారులు అల్లాడుతున్నారు. వీటిని పూర్తి చేయడానికి ఎవరూ రావడం లేదు. ఇప్పటికే రూ.కోట్ల బిల్లులు తీసుకున్న తోపుదుర్తి పత్తా లేరు. ప్రస్తుతం విజిలెన్సు విచారణ చేపట్టారు. ఎన్నిసార్లు ఎమ్మెల్యే సంస్థకు నోటీసులు ఇచ్చినా.. సమాధానం లేదు.

ఈనాడు, అమరావతి

వైకాపా ఏలుబడిలో అప్పటి రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సంస్థ.. రాక్రీడ్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ జగనన్న ఇంటి లబ్ధిదారులకు మొండిచేయి చూపింది. తక్కువ సొమ్ముకే ఇళ్లు నిర్మిస్తామని నమ్మబలికి అసలుకే ఎసరు పెట్టింది. సిమెంటు, స్టీలు, ఇసుక.. తీసుకుని పత్తా లేకుండాపోయింది. ఒక ఇంటిని రూ.1.80 లక్షలకే కట్టిస్తానని ఒప్పందం చేసుకుని తర్వాత మాట మార్చి మరో రూ.35 వేలు తీసుకుంది. రూ.2.15 లక్షలు చేసి.. వారికి మాత్రమే పునాదుల వరకు కట్టింది. తమకు ఇళ్లు కట్టిస్తామని డబ్బు తీసుకున్న రాక్రీడ్ తమను మోసం చేసిందని.. లబ్ధిదారులు కలెక్టరేట్‌లో స్పందనలోనూ ఫిర్యాదులు చేశారు.

20 వేల ఇళ్లని గొప్పలు...

ఉమ్మడి జిల్లాలో 20 వేల ఇళ్లను.. ఒక్కో యూనిట్ రూ.1.80 లక్షలకే కట్టిస్తానని ఒక్క ఇంటినీ పూర్తి చేయలేదు. రాక్రీడ్ సంస్థకు ఇచ్చిన బిల్లులు వెనక్కి తీసుకునేందుకు గృహనిర్మాణ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. నాడు పెద్దలు ఆదేశించడం తరువాయి.. పురోగతి చూడకుండా బిల్లులు మంజూరు చేశారు. నున్న లేఔట్‌లో 4,800 ఇళ్లు, పల్లవానితిప్పలో 4 వేల ఇళ్లను తొలిగా అప్పగించారు. వీటిలో నున్నలో 1600, పల్లవానితిప్పలో 1,200 ఇళ్లను ప్రారంభించారు. నున్నలోవి గన్నవరం.. పల్లవానితిప్పలోవి సెంట్రల్ లబ్ధిదారులకు ఇవ్వాల్సినవి. రెండుచోట్లా పునాదుల వరకు నిర్మించారు. లబ్ధిదారులకు రూ.35 వేల డ్వాక్రా రుణం ఇస్తే వాటిని గుత్తసంస్థ తీసుకుంది. డ్వాక్రా రుణం రూ.9.80 కోట్లు నేరుగా రాక్రీడ్ సంస్థకు చెల్లించారు. అవేకాక.. పునాదుల వరకు వచ్చే రుణం రూ.6.22 కోట్లు బిల్లుల కింద తీసుకున్నారు. ప్రతి ఇంటికి మొదటి దశలో ఇచ్చే సిమెంటు, స్టీలు, ఇసుక తీసుకున్నా 2,800 గృహాలను పునాదుల వరకు లేపి తర్వాత వదిలేశారు. ఆపై యూనిట్ వ్యయం రూ.2.15 లక్షలకు పెంచి.. మళ్లీ కడతామని ముందుకు వచ్చినా పూర్తి చేయలేదు. పలుమార్లు సంస్థకు నోటీసులు ఇవ్వగా... పునాదులపై మూడడుగుల గోడ లేపి.. పిల్లర్లు వేయకుండా వదిలేశారు. ఇప్పటికే ఇసుక, ఇనుము, కంకర, కొంతమేర బిల్లులు తీసుకొన్నారు. 2,800 ఇళ్లకు ఇప్పటికి 20 శాతం బిల్లులు చెల్లించారు. రూ.35 వేల చొప్పున రూ.9.80 కోట్లు తీసుకున్నారు. బిల్లులు, ఇసుక, కంకర.. ఇతర రూపంలో మరో రూ.15 కోట్లు చెల్లించారు.

ఉడాయించిన సంస్థ..!


ఇటుకల యూనిట్ తరలించిన ప్రదేశం ఇదే

నున్న లేఔట్‌లో ఒక సిమెంటు ఇటుక తయారీ ఫ్యాక్టరీ పెట్టారు. అక్కడ లబ్ధిదారులకు చెందిన సిమెంటు, కంకర తరలించారు. ఇటుకలు తయారు చేయలేదు. ఇటీవల ఈ ఫ్యాక్టరీని తరలించారు. ఆ పేరుతో సిమెంటు భారీగా దుర్వినియోగమైంది. పనుల తీరు.. మంజూరు చేసిన బిల్లులపై నివేదిక రూపొందించగా ఏమాత్రం పొంతన లేదు. గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయం నుంచే నేరుగా బిల్లులు చెల్లించారని ఓ అధికారి చెప్పారు. ప్రభుత్వం మారాక విజిలెన్సు విచారణ జరుగుతోంది. హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ కపూర్‌ను వివరణ కోరగా.. విజిలెన్సు విచారణ జరుగుతోందనీ, అసంపూర్తి గృహాల పూర్తికి ఎవరూ ముందుకు రావడం లేదని వివరించారు.

దేశం తలరాతను మార్చేది పారిశ్రామికవేత్తలే


కలంకారీ వస్త్రాన్ని ప్రదర్శిస్తున్న కలెక్టర్ బాలాజీ

పోతేపల్లి (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: పారిశ్రామికవేత్తలు తలచుకుంటే దేశం తలరాతను మార్చగలరని కలెక్టర్ డి.కె.బాలాజీ అన్నారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిల్లా పరిశ్రమల శాఖ సహకారంతో ఎంఎస్ఎంఈ క్లస్టర్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం శుక్రవారం బందరు మండలం పోతేపల్లి జ్యుయలరీ పార్క్‌లో జరిగింది. ఇమిటేషన్ జ్యుయలరీ క్లస్టర్ ఎంటర్‌ప్రెన్యూర్స్ పాల్గొన్న కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతికత అభివృద్ధి కాకుండా ఏ పరిశ్రమ మనుగడ సాగించలేదన్నారు. మచిలీపట్నం ఇమిటేషన్ జ్యుయలరీ ప్రత్యేకమైందని, దీనిని మరో స్థాయికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పెడన కలంకారీ, రైస్‌మిల్లర్లు క్లస్టర్‌గా ఏర్పాటు కావాలని కలెక్టర్ సూచించారు. సిడ్బి జనరల్ మేనేజర్ వి.చంద్రమౌళి మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ ఉద్యోగ, ఉపాధి అవకాశాలనే కాక మన దేశ జీడీపీలో 30శాతం సమకూర్చుతుందన్నారు. మచిలీపట్నంలో త్వరలో సిడ్బి బ్రాంచ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మచిలీపట్నం జ్యుయలరీ పార్క్ అధ్యక్షుడు పి.వి.సుబ్బారావు మాట్లాడుతూ జ్యుయలరీ క్లస్టర్ అభివృద్ధికి జిల్లా కలెక్టర్ విశేష సహకారం అందిస్తున్నారని చెప్పారు. అనంతరం కలెక్టర్ ఇమిటేషన్ జ్యుయలరీ కామన్ ఫెసిలిటీ సెంటర్‌లో స్కిల్‌హబ్‌ను సందర్శించి శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్.వెంకట్రావు, జ్యుయలరీ పార్క్ ఎస్పీవీ క్లస్టర్ డైరెక్టర్ ప్రసాదరావు, జ్యుయలరీ పార్క్ అసోసియేషన్ కార్యదర్శి అంకెం జితేంద్ర, సభ్యులు ఎన్.వి.సుబ్బారావు, సాధు మాల్యాద్రి, వడ్డి శ్రీకాంత్, చలమలశెట్టి ఏడుకొండలు, పినిశెట్టి దినేష్, రైస్‌మిల్లర్స్, పెడన కలంకారి ఎంటర్‌ప్రెన్యూర్స్ పాల్గొన్నారు.





విడిపోలేక.. వీడిపోయారు

ప్రేమజంట బలవన్మరణం


తమ ప్రేమకు గుర్తుగా పచ్చబొట్టు చూపిస్తున్న శైలు, మహేష్ (పాతచిత్రం)

పెదకాకాని, నందిగామ, న్యూస్‌టుడే: వారి అభిరుచులు కలిశాయి.. మనసులు కలిశాయి.. ప్రేమతో చేరువై.. ఏడు అడుగులతో ఒక్కటై.. కలకాలం కలిసి జీవించాలని కలలు కన్నారు. వీరి ప్రేమకు గుర్తుగా ఒకరి చేతిపై మరొకరి పేరు పచ్చబొట్టు వేయించుకున్నారు. ప్రేమ, పెళ్లి విషయం పెద్దల దృష్టికి తీసుకెళ్లగా సమ్మతించ లేదు. కల చెదిరిందని తలచారు.. కలిసి ఉండలేమని తల్లడిల్లారు. విడిపోలేక.. ఏకంగా లోకాన్నే వీడి వెళ్లిపోయారు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునికన్న వారికి పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చారు. ఈ విషాద ఘటన గుంటూరు జిల్లా పెదకాకానిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే పోలీసులు, స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. పెదకాకానికి చెందిన దానబోయిన సాంబశివరావు, సామ్రాజ్యం చిన్న కుమారుడు మహేష్ (22), నందిగామ మండలం రుద్రవరానికి చెందిన నంద్రు వెంకయ్య (లేటు), విజయల చిన్న కుమార్తె శైలజ (20) రెండేళ్ల కిందట హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సెల్ షోరూంలో పనిచేశారు. వారి పరిచయం ప్రేమగా మారింది. కొన్ని నెలల కిందట ప్రేమ విషయం వారు పెద్దలకు చెప్పగా పెళ్లికి నిరాకరించారు. అతను డిప్లొమా చేయగా.. ఆమె ఇంటర్ చదువుకుంది. ఇటీవల శైలజ గుంటూరు వచ్చి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా, మహేష్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. యువతి స్థానికంగా గది అద్దెకు తీసుకొని ఉంటోంది. మహేశ్ కొన్ని రోజుల కింద ఇంటి నుంచి బయటకు వచ్చి ఆమెతో కలిసి ఉంటున్నారు. కుమారుడు ఇంటికి రాకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండడంతో 'మహేష్ నీకు నచ్చినట్లు, నువ్వు చెప్పినట్లు చేస్తాను' అని తండ్రి వాయిస్ మెసేజ్ పంపారు. 'నేను శుక్రవారం సాయంత్రం వస్తాను' అని మహేశ్ సమాధాన సందేశం ఇచ్చారు. మరోవైపు ఈ నెల 10న తన సోదరికి శైలజ ఫోన్ చేసి ఇంటికి వస్తున్నట్లు తెలిపారు. 15 వరకు రాకపోవడంతో ఈ నెల 16న తన కుమార్తె కనిపించటం లేదని నందిగామ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి గుంటూరు కొత్తపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం వారికి తెలియడంతో పెద్దలు తమ పెళ్లి చేయరని భావించి మనస్తాపంతో పెదకాకాని శివారులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. అంతకు ముందు యువతి తన తల్లికి ఫోన్ చేసి పెదకాకాని రావాలని చెప్పి ఫోన్ కట్ చేసింది. రైల్వే పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

(c) eenadu

తప్పులు సరిదిద్దేలా.. వివాదాలు పరిష్కరించేలా..

భూ రీసర్వే వివరాలు లోపాలమయం

గత వైకాపా ప్రభుత్వం తీరుతో రైతుల ఇక్కట్లు

చక్కదిద్దేందుకు 'కూటమి' కార్యాచరణ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

రెవెన్యూ రికార్డుల్లో కచ్చితత్వం, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే తప్పులతడకగా కొనసాగింది. రీసర్వే మొత్తం లోపాల పుట్ట అనేలా పలు ఉదంతాలు జిల్లా వ్యాప్తంగా వెలుగు చేశాయి. కొన్ని భూముల వివరాలను అసలు నమోదు చేయకపోవడం, అడంగల్‌లో ఉన్న విస్తీర్ణం కంటే తక్కువగా కొందరికి, ఎక్కువగా కొందరికి నమోదు చేయడం, వ్యాలిడేషన్ ప్రక్రియ అనంతరం జారీ చేయాల్సిన 9(2) నోటీసుల్ని చాలాచోట్ల ఇవ్వకపోవడం వంటివి తీవ్ర దుమారం రేపాయి. రీసర్వేలో జరిగిన తప్పిదాలతో కంగుతిన్న రైతులు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేసినా, అధికార్లు వాటిని పరిష్కరించలేకపోవడంతో ఇప్పటికీ భూ సమస్యలు కొనసాగుతుండటంతో వీటిని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.



బాపులపాడు మండలంలో ఫిర్యాదులపై క్షేత్ర పరిశీలన చేస్తున్న అధికారులు (పాత చిత్రం)

ఇవిగో నిదర్శనాలు..

★ బాపులపాడులో వివిధ సర్వే నంబర్లలో వేర్వేరు మార్కెట్ విలువలతో ఉన్న వ్యవసాయ భూములన్నింటికీ కలిపి ఒకే ఎల్పీఎం నంబరు ఇచ్చారు. దీంతో 10 నెలల పాటు ఈ గ్రామానికి సంబంధించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుత కలెక్టర్ డీకే బాలాజీ చొరవతో ఇటీవలే ఈ సమస్య పరిష్కారమైంది.

★ రేమల్లెలో అనేక సర్వే నంబర్లకు ఒకటే ఎల్పీఎం ఇవ్వడం, ఒకే సర్వే నంబరులో పలువురు వ్యక్తులకు చెందిన భూముల్ని సంయుక్త ఎల్పీఎం నంబరులో నమోదు చేయడంతో క్రయవిక్రయాలు స్తంభించి, రైతులంతా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

జిల్లాలో ఇలా..

రెవెన్యూ డివిజన్లు	3
మండలాలు	23
గ్రామాలు	290

గ్రామసభల నిర్వహణ.. రీసర్వేలో అవకతవకల ఉదంతాలు జిల్లా వ్యాప్తంగా అనేకం ఉన్నాయి. వీటిపై పదేపదే ఫిర్యాదులు, అర్జీలు వస్తుండటంతో కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపే దిశగా స్పందించింది. రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభల నిర్వహణకు కార్యాచరణ చేపట్టింది. ఈనెల 17 నుంచి వచ్చే నెల 14 వరకు ఈ సభలు ఏర్పాటు చేసి, రైతుల నుంచి లిఖిత పూర్వకంగా అభ్యంతరాలు, అర్జీలు స్వీకరించేలా ఏర్పాట్లు చేసింది. 15 రోజుల వ్యవధిలోనే వీటిని పరిష్కరించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. పైగా రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో పక్కాగా జరగాలని, హడావుడి లేకుండా గరిష్ఠంగా 120 రోజుల వ్యవధి ఇస్తూ, నిరంతరం కలెక్టర్, జేసీలు పర్యవేక్షించేలా ఆదేశాలు సైతం జారీ చేసింది.

లారీని ఢీకొన్న కారు

జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇక్కట్లు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం గూడవల్లి జాతీయ రహదారి వద్ద శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి గన్నవరం వైపు వెళ్తున్న కారు ఓ లారీని ఢీకొంది. గూడ్సు లారీ అడ్డరోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి వస్తుండగా ఈ ఘటన జరిగింది. కారు ముందు భాగం ధ్వంసం కాగా.. అందులో వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విమానాశ్రయానికి వెళ్లే దారి కావడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. సాయంత్రం అయిదు గంటల సమయంలో ప్రమాదం జరగగా.. దెబ్బతిన్న కారును రోడ్డుపై నుంచి రాత్రి ఏడు గంటల వరకు తొలగించలేదు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పటమట సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

రహదారి ప్రమాదాలను పూర్తిగా నివారించాలి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో రహదారి ప్రమాదాలను పూర్తిగా నివారించే విధంగా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లా రవాణా అధికారిణి మనీషా పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా మూడేళ్ల వ్యవధిలో చోటుచేసుకున్న ప్రమాదాలు వివరించారు. ప్రమాదాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 61 బ్లాక్ స్పాట్లు గుర్తించామని, ఇందులో అత్యధికంగా 30 స్పాట్‌లు మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిలో ఉన్నాయన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువగా ప్రమాదాలు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్యే జరగడానికి కారణాలను ప్రశ్నించారు. రహదారులపై వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాల వద్ద ఇనుప కమ్మీలతో గ్రిల్స్ ఏర్పాటు చేసి నీరు కిందకు పోయేలా చూడాలన్నారు. జిల్లాలో 75 హిట్ అండ్ రన్ కేసులు నమోదవ్వగా 9 కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్‌కు పంపామన్నారు. ప్రముఖులు ప్రయాణించే గన్నవరం విమానాశ్రయం వద్ద జాతీయ రహదారిపై విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగడం లేదన్నారు. ఏఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్, ఎన్‌హెచ్ పీడీ శ్రీధర్‌రెడ్డి, డీపీటీవో శ్రీవాణి, తదితర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



రహదారి భద్రతా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం

పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశంలో పారిశ్రామిక పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధిపై మంత్రివర్గం ఇటీవలే చర్చించిందని, ఇందుకు సంబంధించిన నిర్ణయాలు త్వరలో రాబోతున్నాయని చెప్పారు. ప్రభుత్వం పారిశ్రామికంగా జిల్లాకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా వచ్చిన దరఖాస్తులు పరిశీలించి రెండు మూడు రోజుల్లో చర్యలు తీసుకోవాలన్నారు. విశ్వకర్మ యోజన పథకం కింద ఎంపికైన పది మంది లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను కలెక్టర్ పంపిణీ చేశారు. జిల్లా పరిశ్రమల మేనేజర్ వెంకట్రావు, ఎల్‌డీఎం జయవర్ధన్, ఏపీఐఐసీ జెడ్‌ఎం బాబ్జి, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

నదిలో స్నానానికి దిగి కార్మికుడి గల్లంతు



తోట్లవల్లూరు కృష్ణానది పాయలో పడవలపై గాలిస్తున్న జాలర్లు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : పొట్టకూటి కోసం వచ్చిన కార్మికుడు కృష్ణానదిలో గల్లంతైన ఘటనతోట్లవల్లూరులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట నుంచి ముగ్గురు సభ్యులున్న సెప్టిక్ ట్యాంకు బృందం రెండు రోజుల కిందట వచ్చింది. వారితో ఉయ్యూరుకు చెందిన జగన్నాథమూర్తి(35) కలిశారు. వీరంతా కలిసి శుక్రవారం తోట్లవల్లూరులోని ఓ ఇంటి వద్ద ట్యాంకు శుభ్రం చేసి కరకట్టపైకి చేరుకున్నారు. ఈ బృందంలోని మహిళ నది వద్ద బట్టలు శుభ్రం చేస్తుండగా మిగతా ముగ్గురూ స్నానానికి దిగారు. వారిలో ఒకరు గుంతలో పడి నీటి వేగానికి కొట్టుకుపోయారు. ఇది గమనించిన వీర్లు అనే జాలరు పడవలో వెళ్లి అతడిని రక్షించే ప్రయత్నం చేయగా అప్పటికే జగన్నాథమూర్తి ఆచూకీ లభించలేదు. సమాచారం అందుకున్న ఎస్సై అర్జున్‌రాజు, తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, సీఐ వై.చిట్టిబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జాలర్లు పడవలపై గాలింపు చర్యలు చేపట్టినా అతడి ఆచూకీ లభించలేదు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వార్షిక రుణ లక్ష్యాలు అధిగమించాలి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: బ్యాంకర్లు వార్షిక రుణ లక్ష్యాలను అధిగమించేలా చొరవచూపాలని కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో రుణప్రణాళిక పురోగతిని సమీక్షించి పలు సూచనలు చేశారు. వరద ప్రభావిత జిల్లాగా ఆర్‌బీఐ జారీ చేసిన సర్క్యులర్ మేరకు మరో ఏడాది పాటు రుణాలను రీస్ట్రక్చరింగ్ చేయాలన్నారు. ఎల్డీఎం జయవర్ధన్, ఆర్బీఐ జీఎం సునీల్, ఇండియన్ బ్యాంకు జెడ్‌ఎం రాజేష్, వివిధ శాఖల అధికారులు, పలువురు బ్యాంకు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

పోర్టు పనులపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

బందరు పోర్టు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జేసీ గీతాంజలిశర్మతో కలిసి బందరు పోర్టు, గన్నవరం విమానాశ్రయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోర్టు విషయంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ఆయన సూచనలకు అనుగుణంగా వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తికావాలని స్పష్టం చేశారు. విమానాశ్రయ విస్తరణలో భాగంగా నెలకొన్న భూసమస్యలు, ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ, రైతులకు పరిహారం చెల్లింపు అంశాలపై చర్చించారు. డీఆర్వో చంద్రశేఖరరావు, మెగా ఇంజినీరింగ్ సంస్థ జీఎం తులసీదాస్, మారిటైం బోర్డు అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు సమావేశంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరి మృతి

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : ఈ నెల 17న పామర్రు మండలం బల్లిపర్రు సెంటరులో రెండు స్కూటీలు ఢీకొన్న ఘటనలో గాయపడిన ముగ్గురిలో ఇద్దరు మృతి చెందారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు దుర్గానగర్‌కు చెందిన బళ్లా వేణువర్ధన్(20), పామర్రు మండలం పెదమద్దాలికి చెందిన ఎం.వెంకటేశ్వరరావు(62) విజయవాడలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం వచ్చిందని పామర్రు ఎస్సై అవినాష్ శుక్రవారం తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన దున్నల నాగపూర్ణిమ(35) నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డ్వాక్రా మహిళపై దాడి.. రూ.61 వేలు చోరీ

పెనమలూరు, న్యూస్‌టుడే: డ్వాక్రా మహిళపై ఇద్దరు ఆగంతుకులు దాడి చేసి నగదు దోచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడకుదురు మీనా యనమలకుదురు విశ్వశాంతినగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆమె ఓ డ్వాక్రా సంఘంలో సభ్యురాలు. సభ్యులు కట్టిన రూ.61 వేలు నగదును అదే ప్రాంతంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమ చేయడానికి శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో బ్యాంకుకు బయల్దేరారు. సాయినగర్ వీధిలో నడుస్తుండగా వెనుక నుంచి ద్విచక్రవాహనం పై వేగంగా వచ్చిన ఇద్దరు ఆగంతుకులు దాడి చేసి చేతిలోని నగదు సంచిని లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: దీర్ఘకాలంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధంగా ఉన్నట్లు యూటీఎఫ్ నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో దశలవారీ పోరాటంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఎ.ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.కనకారావు, జె.లెనిన్‌బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాం నుంచి అపరిష్కృతంగా ఉన్న కీలక సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలని, నవంబరు లోపు అప్‌గ్రేడ్ పోస్టుల్లో ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. అర్హులైన ప్రధానోపాధ్యాయులను అర్బన్ ఎంఈవోలుగా నియమించాలన్నారు. ఉపాధ్యాయులతో జీపీఎఫ్ ఖాతాలు తెరిపించాలని, బదిలీలు చేపట్టాలని కోరారు. ధర్నా అనంతరం దాదాపు తొమ్మిది సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఈవో కార్యాలయంలో అందజేసి పరిష్కార చర్యలు కోరారు. సమస్యలకు పరిష్కారం లభించే వరకూ సమష్టిగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. సమాఖ్య నాయకులు ఎన్.ప్రభాకరరావు, ఎండీ షౌకత్‌హుస్సేన్, వరప్రసాద్, మున్సిపల్ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల శాఖల బాధ్యులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు ధర్నాలో పాల్గొన్నారు.



యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయుల ధర్నా

టెట్‌కు 85.54 శాతం హాజరు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ కేంద్రాల్లో నిర్వహిస్తున్న టెట్ పరీక్షలు సజావుగా సాగుతున్నాయని డీఈవో తాహెరా సుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం కేవలం రెండో సెషన్ పరీక్షలు మాత్రమే జరిగాయి. మధ్యాహ్నం 3 కేంద్రాల్లో పరీక్షలు జరగ్గా 1335 మందికి 1142 మంది హాజరయ్యారని, 193 మంది గైర్హాజరయ్యారని, 83.54 శాతం హాజరు నమోదైందని పేర్కొన్నారు.

పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గొడవర్రు ప్రభుత్వ పాఠశాలలో అయిదో తరగతి చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులు శుక్రవారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో మందులు పిచికారీ చేస్తున్న సమయంలో పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలోకి వాటి ఘాటు ప్రవేశించింది. దీంతో తరగతి కిటికీలు మూసివేశారు. కొంత సమయానికి పలువురు విద్యార్థులు తమకు కళ్లు తిరుగుతున్నాయని ఉపాధ్యాయులకు చెప్పడంతో స్పందించిన ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు బాధితులను కంకిపాడులోని సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అక్కడి పిల్లల వైద్యుడు చంద్రశేఖర్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ముందస్తు చర్యలో భాగంగా ఫ్లూయిడ్స్, ఆక్సిజన్ అందజేయాలని సిబ్బందికి సూచించారు. రెండు గంటల పర్యవేక్షణ అనంతరం విద్యార్థులను ఇంటికి పంపారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

జాతీయ రహదారిపై చిమ్మ చీకట్లు

రెండు వారాలుగా వెలగని దీపాలు



వీరవల్లి వద్ద జాతీయ రహదారిపై అంధకారం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: అత్యంత రద్దీగా ఉండే చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై రాత్రి వేళ ప్రయాణం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. గన్నవరం నుంచి బొమ్ములూరు వరకు దాదాపు 25 కి.మీ మేర వ్యాపించి ఉన్న ఈ మార్గంపై ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు గత రెండు వారాలుగా వెలగడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి ఈ మార్గాన్ని ఆరు వరసలుగా విస్తరించిన తర్వాత ఇరువైపులా ఉన్న గ్రామాలను వేరు చేస్తూ ఎక్కడికక్కడ వంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించారు. ప్రధాన రహదారి, సర్వీసు రోడ్లలో ప్రయాణించే వారికి రాత్రి సమయాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు విద్యుత్తు దీపాల వ్యవస్థ అమర్చారు. మొదట్లో కొంతకాలం ఇవి బాగానే పనిచేసినా, ఆ తర్వాత నిర్వహణ, పర్యవేక్షణ లోపించడంతో మరమ్మతులకు గురయ్యాయి. తాజాగా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు శుక్రవారం పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వచ్చిన సమయంలోనూ ఇవి పనిచేయకపోవడంపై గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

91.9 FM Vijayawada ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజి స్టైల్	సా. 5 - రా. 9
ఈ స్టార్ మీ స్టార్	రా. 9 - రా. 10
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 10 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297









EENADU Classifieds

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

AP ప్రభుత్వంచే ఆమోదం పొందిన ఇసుక లారీ / ట్రాక్టర్‌లకు GPS అమ్మేందుకు డీలర్లు కావలెను. కంపెనీ వారి సంప్రదింపు నంబర్లు: Volty IoT Solutions 8367307070 9666841234

BUSINESS OFFER

సువర్ణావకాశం 30 సం॥ల పైబడిన మార్కెటింగ్ మేనేజర్స్ (స్త్రీ/పు) కావలెను. పెట్టుబడి లేకుండా మంచి ఆదాయం & స్పెషల్ ఇన్సెంటివ్స్. ఫోన్: 770 260 4647.

REAL ESTATE

పటమట NTR సర్కిల్ SBI-MED-PLUS, బందర్‌రోడ్ నుండి 5th ఇల్లు చ॥గ॥ 222 లు, మరియు దుర్గా మహల్ వెనుక రోడ్ 3bhk కొత్త ఫ్లాట్ అమ్మకమునకు కలదు. 63000 65270.

AP రాజధానిలో కమర్షియల్ స్థలం గజం 23 వేలు, మంగళగిరిలో గజం 14 వేలు, కమర్షియల్ 30 లక్షలు, 15 వేలు రెంటు, గుంటూరులో గజం 23 వేలు కమర్షియల్ 41 వేలు. Ph: 96035 30555.

FLAT FOR SALE

PENAMALURU

గృహప్రవేశంకు సిద్ధముగా విజయవాడ, పెనమలూరులో, MRO ఆఫీస్ వద్ద New DLX 2 BHK (1346 S.Ft) ఫ్లాట్స్- Bank Loan సౌకర్యాలతో 43 లక్షలు. ✆ 97014 83087.

RAMAVARAPPADU

2 BHK, E/F, 1st Floor in Group House 700 S.Ft., Semi Furnished Apartment (34 Sq. Yards) at Ramavarappadu @ 27 Lakhs. Contact: 93905 15052.

GENERAL

VJA కానూరు కల్పనా నగర్ గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న APCRDA అప్రూవ్డ్ 2 BHK ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. ✆ 98668 82470, 70368 25555.

Newly Constructed SKR Heights. Double (2 BHK) Bedroom Flats 1200 S.Ft. Ayyappa Nagar, Veera Sawarkar Road, VJA. ✆ 96660 16789.

PLOT FOR SALE

ఆఫర్-8 గ్రా॥ గోల్డ్ & రిజి॥ ఫ్రీ. కంచికచర్ల - HYD హైవే నుండి అమరావతికి 15Km. CRDA వెంచర్, ORR కి 200 మీ॥ కంచికచర్ల దగ్గర ఇళ్ళ ప్రక్కన, బ్యాంకు లోన్. ✆ 88018 03689.

ఆఫర్ - 45 Inches స్మార్ట్ T.V & రిజి॥ ఫ్రీ. కంచికచర్ల - HYD హైవే నుండి అమరావతికి 15Km, CRDA వెంచర్, ORRకి 200 మీ॥, కంచికచర్ల దగ్గర, ఇళ్ళ ప్రక్కన, బ్యాంక్ లోన్ ✆ 73372 04349.

VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బందరురోడ్డు, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ, నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP & APCRDA ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 12,900/- సంప్ర: ✆ 93985 76997.

కమర్షియల్ ప్లాట్ సేల్

గుణదలలో కమర్షియల్ ప్రాపర్టీ 461 చ॥గ॥లు ఏలూరు రోడ్డుకి 2వ బిట్ అమ్మకంనకు కలదు ✆ 86886 53237 91773 79999

విజయవాడ to హైదరాబాద్ హైవే ఫేసింగ్ కమర్షియల్ ల్యాండ్ 4 ఎకరాలు కలదు. ఐకానిక్ బ్రిడ్జికి 300 మీటర్స్‌లో కోర్ క్యాపిటల్ అమరావతికి 5 KM దగ్గరలో. Ph: 93477 56501

WANTED

తూర్పు (or) తూర్పు ఉత్తరం (or) తూర్పు దక్షిణం ఫేసింగ్ ఓపెన్ ల్యాండ్ (or) హౌస్ 250 చ॥గ॥ లోపల కరెన్సీనగర్, పటమట, కనకదుర్గ కాలనీ, RTC కాలనీ, PNT కాలనీలో ఉంటే డైరెక్ట్ ఓనర్స్ మాత్రమే సంప్రదించగలరు. నో బ్రోకర్స్ ప్లీజ్. ప్రొఫెసర్ శ్రీధర్‌వర్మ. ✆ 86361 28941.

TO LET

2 BHK Semi Furnished House, Opp: Stella College Road, Gayatri Nagar. Acharya Ranga Street. Rent: 12,000/- Car parking. ✆ 98481 80313.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్

COMMERCIAL

Spacious 2 Bed Room Flat at the Heart of the City on Bandar Road (MG Road) for Offices Only. ✆ 98490 15616 / 78290 21211.

మచిలీపట్నం Axis Bank ఎదురుగా క్రింది షాపు అద్దెకు కలదు & పైన షాప్స్ అవసరమునుబట్టి ఫ్యామిలీ పోర్షన్‌గా ఉపయోగపడును. ఫోన్: 98665 02268.

JOBS

Wanted Incharge, English Faculty with Experience and Primary Mother Teachers with Good Communication Skills. Salary 10K Above. Ajithsingh Nagar, VJA. ✆ 90101 18121.

కావలెను

ప్రముఖ న్యాయవాది ఆఫీసులో పనిచేయుటకు
1. జూనియర్ న్యాయవాదులు (3 సం॥ల అనుభవం, జీతం 25 వేలు ఆపైన)
2. ఇంటి అటెండరు (2 వీలర్ ఉండాలి)
3. సెక్యూరిటీ గార్డు కావలెను. (20 నుండి 40 సం॥ల మధ్య వయస్సు)
గాంధీనగర్, విజయవాడ-3. ఫోన్: 90003 22875 8184840683

PLANT MANAGER

Required for Round the Clock Running Poultry Feed Factory at Nidamanuru, Vijayawada. Candidates have 3 years Working Experience can Apply. Lokesh Aqua Products Private Limited D.No: 13-16, Nidamanuru, Vijayawada. 7981680981

Wanted Receptionist, Class Incharge, Telecallers, Graphic Designer & Marketing Executives to work in a reputed Commerce institute in Labbipet, Vja. Age: 25-40. 91542 10069.

Wanted Experienced Faculties to Teach MS Office, C Language, Java, Python, Tally, SAP, Auto CAD, 3DS Max, Revit, Catia, Spoken English. Ph: 99859 43539.

Wanted Freshers/ 1 Year Experience Technical Sales Executives, B.Sc Computers/ Diploma. WhatsApp: +91 9701132415. sales@netlogon.us, Walk-in on 22-10-2024.

మంగళగిరిలోని ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నందు పనిచేయుటకు టాలీ తెలిసిన అకౌంటెంట్ కావలెను. ✆ 98853 99799, 87900 78465.

విజయవాడలో ప్రముఖ యాడ్ ఏజెన్సీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయుటకు డిగ్రీ చదివి టూవీలర్ కలిగిన 25 సం.లలోపు యువకులు కావలెను. సం: 94914 24433.

శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను / పేషెంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని/ వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. ✆ 99120 11499, 99120 11899.

బ్రాహ్మణ వంట వాళ్లు కావలెను. సంప్రదించండి. శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమము, పెంచలకోన, రాపూరు మండలం. SPSR నెల్లూరు జిల్లా. Ph.No: 97051 86006

ఆర్వి డిజిటల్స్ విజయవాడ ఆఫీసు నందు మార్కెటింగ్ స్టాఫ్, రిక్కీ, బ్రాండింగ్ & పేస్టింగ్ టీం, వెల్డింగ్ పర్సన్, ఆఫీస్ బాయ్స్ కావలెను. ✆ 73868 07773.

ప్రముఖ గైనిక్ హాస్పిటల్‌లో మెడికల్ షాపు (ఫార్మశి) లో పనిచేయుటకు B.Pharmacy చదివి అనుభవం కలిగిన స్త్రీ అభ్యర్థులు కావలెను. సంప్ర: 93973 41745.

ప్రముఖ మ్యారేజ్ బ్యూరోలో పనిచేయుటకు ఆఫీస్ అసిస్టెంట్స్, టెలీకాలర్స్‌గా చేయుటకు 22సం॥ నుండి 45సం॥ అనుభవం ఉన్న స్త్రీలు కావలెను. సంప్ర: ✆81212 46222.

సెక్యూరిటీ గార్డ్స్, ఆఫీస్ బాయ్స్, వంట మనిషి (పురుషుడు) కావలెను. విజయవాడలో ఏలూరు రోడ్డు, తాడేపల్లి, పోరంకి దగ్గర, 12 గం డ్యూటీ, జీతం: 15 - 18 వేలు + PF & ESI. ✆ 91337 72288

విజయవాడ, ఆటోనగర్‌లో, ఫుడ్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసులో పనిచేయుటకు 10th చదివి 2 వీలర్ లైసెన్స్ కల్గిన డెలివరీ బాయ్స్ కావలెను. ✆ 98487 08484.

RN LIC కంపెనీ అనుబంధ సంస్థ విజయవాడలో P/F MGR కేటగిరిలో పనిచేయుటకు M/F, వ : 27 సం॥ పైన కావలెను. Q: డిగ్రీ, ఫిక్స్డ్ జీతం + INC. ✆ 83318 45629, 88862 49308.

WANTED

విజయవాడ నందు ప్రముఖ స్వీట్ షాపులో వర్కు చేయుటకు అనుభవం కలిగిన లేడి సూపర్‌వైజర్స్, లేడి అకౌంటెంట్ కావలెను. మిఠాయి, కానూరు ✆ 99631 23453

MARKETING/ SALES

Sai Rajendra Gold Palace. Wanted Jewellery Experienced ★ Sales Executives ★ Computer Operator. Walk-In Interview with Biodata # 39-1-79, Near Gateway Hotel, Opp : Mochi M.G.Rd, Vijayawada. ✆ 2466533, 9186666 52027.

Book your 5 lines Classified Colour Rs.1200/- 3Ads Package Rs.3250/- 5 lines Classified B/W Rs.1025/- 3Ads Package Rs.2575/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం PH: 98496 97616

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మచిలీపట్నం

●మచిలీపట్నం ●పెడన

20న దావోజీపాలెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: దావోజీపాలెంలో ఆదివారం ఉదయం 10 గంటలకు విజయ అలేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు అంకె శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ పటమటకు చెందిన అశ్విని ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచిత కంటి పరీక్షలతో పాటుగా అవసరమైన వారికి ఆపరేషన్లు చేసి కళ్లజోళ్లు అందిస్తారని తెలిపారు. విజయవాడ చైతన్య కంటి ఆస్పత్రికి చెందిన వైద్యులు అంకెం శ్రీనివాస్, గీతా శ్రీనివాస్, చైతన్య, అరవింద్, నిఖిల, మీనాక్షి శిబిరంలో పాల్గొంటారని వివరించారు.

నందమూరులో సజావుగా టెట్

పెడన, న్యూస్‌టుడే: నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో టెట్ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. ఈ నెల 3న ప్రారంభమైన ఈ పరీక్షలు 21వరకు కొనసాగనున్నాయి. మొత్తం 6వేల మందికి పైగా అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష రాయనున్నారు. శుక్రవారం 190 మందికి 147 మంది హాజరయ్యారని పరీక్ష కేంద్రం అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు.

మునగాకుతో సంపూర్ణ ఆరోగ్యం

బంటుమిల్లి, న్యూస్‌టుడే: మునగాకులో ఐరన్, కాల్షియం సంపూర్ణంగా ఉంటాయని ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్ట్ సీడీపీవో సముద్రవేణి అన్నారు. శుక్రవారం బంటుమిల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద మునగాకు ఫెస్టివల్‌ను నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగలక్ష్మీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

☛నగరంలోని జిల్లా కోర్టు సెంటరు నుంచి నాయర్‌బడ్డీ సెంటరుకు వెళ్లేదారితో పాటు దిశ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో రహదారి పక్కనున్న చెత్త మేటలు తొలగించకపోవడంతో అక్కడకు పశువులు చేరుతున్నాయి. దీని వల్ల రాకపోకలకు ఇబ్బందికరంగా మారడంతో సమస్యను ఆ ప్రాంతవాసులు 'మేమున్నాం..మీకుతోడుగా' దృష్టికి తీసుకురాగా ఈనాడులో వార్త ప్రచురించగా అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి చెత్త తొలగించి శుభ్రం చేయించేలా చర్యలు తీసుకున్నారు.

☛ పెడన మండలం చేవెంద్రపాలెంలో ఉప్పలకలవగుంట సామూహిక రక్షిత నీటి పథకం పైపులైన్‌కు లీకు ఏర్పడి గత కొన్ని రోజులుగా తాగు నీరు వృథాగా పోతోంది. స్థానికులు సమస్యను మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించిన వెంటనే స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేశారు.-మచిలీపట్నం(గొడుగుపేట), –గూడూరు, న్యూస్‌టుడే



పైపులైన్ లీకు మరమ్మతులు చేస్తున్న కార్మికుడు

? పెడన మండలం బల్లిపర్రు గ్రామంలో రక్షిత నీటికి ఇబ్బందులు పడుతున్నాం. రొయ్యల చెరువుల సమీపాన నీటి పథకం ఉండడంతో అరకొరగా సరఫరా అయ్యే నీరు తాగడానికి యోగ్యంగా లేదు. ఉప్పలకలువగుంట సామూహిక రక్షిత నీటి పథకం నుంచి చుక్క నీరు అందడం లేదు. మంచినీటి సమస్య పరిష్కరించండి. **-స్థానికులు**

✔ ఈ విషయం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాం. నందమూరులో 25 ఎకరాల్లో రక్షిత నీటి పథకం ఏర్పాటు చేసి బల్లిపర్రు గ్రామాన్ని అనుసంధానం చేస్తామని చెప్పారు. ఈ పథకం రూపకల్పన జరిగితే సమస్య పరిష్కారం అవుతుంది. **- జోగి నాగవరలక్ష్మీ, బల్లిపర్రు గ్రామ సర్పంచి,**

–పెడన గ్రామీణం, న్యూస్‌టుడే

అంతటా మడుగులు.. అడుగులోతు గుంతలు



బందరు మండలం పోతేపల్లి వెళ్లేదారిలో బీసీ వసతిగృహం వద్ద ఇలా..



పోతేపల్లి దారిలో..



హుస్సేన్‌పాలెం- చిట్టిపాలెం రోడ్డు

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

వైకాపా పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. బందరు, పెడన నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో రహదారులు గోతుల మయంగా మారాయి. ప్రమాదాలు జరుగుతున్నాయని మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో అంతంతమాత్రంగా ఉన్న రోడ్లు వర్షాల కారణంగా క్రమేపీ అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. బందరు నగరం నుంచి మండల పరిధిలోని పోతేపల్లి గ్రామానికి వెళ్లే రహదారి అడుగులోతు గుంతలు.. అడుగడుగుకీ మడుగులుగా మారింది. కనీసం ద్విచక్ర వాహనం వెళ్లాలన్నా ఇబ్బందికరంగా ఉంది. కనీసం గుంతలు కూడా పూడ్చకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు.

ఎక్కడెక్కడ ఎలా.. బందరు మండలంలోని హుస్సేన్‌పాలెం నుంచి చిట్టిపాలెం మీదుగా అరిశేపల్లి వెళ్లే రహదారి కూడా గుంతల మయంగా మారింది. ✪ గూడూరు మండలంలోని తరకటూరు నుంచి మద్దిపట్ల వెళ్లే రహదారి పొడవునా గుంతలు ఏర్పడడంతో పాటు పలుచోట్ల ఛిద్రమైపోయింది. ఈ రోడ్డు వెంట రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. తరకటూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ✪ ఇలా వివిధ గ్రామాల్లో అస్తవ్యస్తంగా మారిన ఆ రోడ్ల వెంట ప్రయాణం చేయాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. కూటమి ప్రభుత్వం రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నందున అధికారులు స్పందించి త్వరితగతిన వాటిని బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు



పెడన: ఉరిమి- గాయంపాడు వెళ్లే రోడ్డు



గూడూరు: తరకటూరు–మద్దిపట్ల మధ్య..

పోతేపల్లి డ్రెయిన్ సమస్య పరిశీలన



పోతేపల్లిలో డ్రెయిన్ తవ్వాల్సిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో స్వాతి

పోతేపల్లి (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: పోతేపల్లి దుఃఖదాయినిగా నిలుస్తున్న డ్రెయినేజీ సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించింది. మచిలీపట్నం-విజయవాడ రైల్వే లైన్‌ను రెండు వరుసలుగా విస్తరించే సమయంలో డ్రెయిన్‌ను పూడ్చి వేశారు. దీంతో వర్షాకాలంలో పోతేపల్లి గ్రామమంతా ముంపునకు గురవుతోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో గ్రామస్థులు చేసిన విన్నపాలు అరణ్యరోదనగా మిగిలాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైల్వే అధికారులు, జిల్లా కలెక్టర్ బాలాజీ పోతేపల్లి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. మంత్రి కొల్లు రవీంద్ర సమస్యను పరిష్కరించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. శుక్రవారం మచిలీపట్నం ఆర్డీవో స్వాతి డ్రెయినేజీ నిర్మించాల్సిన ప్రాంతాన్ని సందర్శించారు. రైల్వే శాఖకు సంబంధించిన స్థలం వెంబడే డ్రైన్ నిర్మించవచ్చని గ్రామ తెదేపా నాయకుడు కాటం మధుసూదనరావు ఆర్డీవోకు వివరించారు. ఇందుకోసం స్థలసేకరణ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇరిగేషన్ డీఈఈ లక్ష్మీనారాయణ సైతం శుక్రవారం పోతేపల్లిలో డ్రైన్ నిర్మించాల్సిన ప్రాంతాన్ని సందర్శించారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 29 నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.నాగరాజు, వి.పోతురాజు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయి సిబ్బందికి అంతర్గత పదోన్నతులు కల్పించాలని, చనిపోయిన సిబ్బందికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్న డిమాండ్లు దీర్ఘకాలంగా అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు సమ్మెలోకి వెళ్తున్నట్లు ఒక ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.

విద్యుత్తు సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదన హేయం

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: ట్రూఅప్, విద్యుత్ ఛార్జీల సర్దుబాటు పేరుతో ప్రజలపై వేల కోట్ల భారం మోపేందుకు విద్యుత్ నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం హేయమని సీపీఎం నాయకులు విమర్శించారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో వినియోగదారులపై మోయలేని ఆర్థిక భారం వేయాలనే ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు శుక్రవారం జిల్లా శాఖ ఆధ్వర్యాన శుక్రవారం కోనేరుసెంటరు వద్ద వర్షపునీటిలో నడుస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ ట్రూఅప్, సర్దుబాటు పేరుతో వైకాపా ప్రభుత్వం ప్రజలను దోచుకున్న తీరుపై అప్పటి ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత కూటమి పార్టీలు తీవ్రంగా ఖండించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. తెదేపా ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా బాదుడే.. బాదుడు అంటూ నిరసన కార్యక్రమాలు చేపట్టడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు అధికారం చేపట్టాక అదే తప్పును ప్రజల నెత్తిన రుద్దాలనుకోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేయకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకులు బూర సుబ్రమణ్యం, కొడాలి శర్మ, మాదాల వెంకటేశ్వరరావు, చంద్రపాల్, కొల్లాటి శ్రీనివాసరావు, జయరావు తదితరులు పాల్గొన్నారు.



వర్షపు నీటిలో నడుస్తూ సీపీఎం నాయకుల నిరసన

నిబంధనల మేరకే బాణసంచా విక్రయాలు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: దీపావళి పండగ సందర్భంగా నిబంధనల మేరకే బాణాసంచా విక్రయాలు చేపట్టాలని బందరు డీఎస్పీ అబ్దుల్‌సుభాన్ స్పష్టం చేశారు. డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా బాణాసంచా తయారీకి పాల్పడినా, అక్రమంగా నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. బందరు సబ్‌డివిజన్ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా బాణసంచా విక్రయాలు చేస్తున్న పెడనకు సంబంధించి ఆరుగురిపై, గుడివాడ సబ్‌డివిజన్ పరిధిలో ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఎవరైనా టపాసులు, మందుగుండు సామగ్రి అక్రమంగా నిల్వ ఉంచినా, బాణసంచా తయారీకి పాల్పడుతున్నట్లు గుర్తించినా తక్షణం పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్‌సుభాన్

మానవ ప్రమేయం లేకుండానే సాంకేతిక అభివృద్ధి

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: రానున్న కాలంలో మనిషి ప్రమేయం లేకుండానే ఏఐ, ఎంఎల్ సాంకేతిక సహాయంతో యంత్రాలు పరుగులు తీస్తూ ప్రపంచం ముందడుగు వేస్తుందని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్(ఇండియా-ఐఈఐ) రాష్ట్ర సెంటర్ ఛైర్మన్ డాక్టర్ చింతమనేని వెంకటశ్రీరాం పేర్కొన్నారు. స్థానిక ఎస్ఆర్‌జీఈసీలో రెండు రోజులు పాటు వివిధ కళాశాలల అధ్యాపకులకు ఎంపవరింగ్ ఇంజినీర్స్ త్రూ అడ్వాన్స్‌డ్ ఏఐ, ఎంఎల్ టెక్నాలజీస్ అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఐ, ఎంఎల్‌లకు సంబంధించిన వివిధ సంఖ్యాధారిత శాస్త్ర గణాంకాలు, నిరూపిత అంశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధ్యాపకులకు ఐఈఐ రాష్ట్ర కార్యదర్శి దేవీకుమార్, డేటా సైంటిస్ట్ ప్రణయ్‌కుసుమ వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.కరుణకుమార్, వైస్ ప్రిన్సిపల్స్ పి.కోదండరామారావు, ఎంఆర్‌సీహెచ్.శాస్త్రి, డైరెక్టర్లు ఎం.కామరాజు, ప్రసాద్‌తోపాటు పి.రవీంద్రబాబు, నాగమణి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



ఇంతేరులో సీసీ రోడ్ల నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

ఇంతేరు, చినపాండ్రాక (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాలన్నీ కళకళలాడతాయని, సంక్రాంతికి నిర్మాణాలు పూర్తికావాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం కృత్తివెన్ను మండలంలోని ఇంతేరు, చినపాండ్రాక పంచాయతీలలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన పల్లెపండగ కార్యక్రమంలో కాగిత మాట్లాడారు. చినపాండ్రాక గ్రామ పంచాయతీలో ఎంజీఎన్ఆర్ఎస్ నిధులు రూ. 21.3లక్షలతో, ఇంతేరులో రూ. 15లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణానికి కాగిత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. మండల తెదేపా, జనసేన అధ్యక్షుడు ఒడుగు తులసీరావు, డిప్యూటీ తహసీల్దార్ శశికుమార్, తమ్ము ఆంజనేయులు, పాండురంగారావు, కేదార్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్వతీదేవికి ప్రత్యేక అలంకరణ

గూడూరు, న్యూస్‌టుడే: ఐదుగుళ్లపల్లి గ్రామంలో పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి శ్రీచక్రఅభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వివిధ రంగుల ఊలుతో అలంకరించగా భక్తులు అధిక సంఖ్యలో దైవదర్శనం చేసుకున్నారు.



పూజలు అందుకున్న అమ్మవారు

శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలి

పోలవరం (గూడూరు), న్యూస్‌టుడే: కలంకారీలో అందుబాటులోకి వస్తున్న నూతన పద్ధతులపై అందిస్తున్న శిక్షణను వినియోగించుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో కలంకారీలో వినియోగించే సహజసిద్ధ రంగుల తయారీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వాసవ్య మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత సంస్థ ద్వారా అందిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. శిక్షకుడు కె.వెంకటేశ్వరరావు అరటిపండ్లు, కరక్కాయ, సున్నం, పటిక కలిపి తయారు చేసే రంగులపై మహిళలకు శిక్షణ అందించారు. మాజీ సర్పంచి కారుపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ సహజసిద్ధ రంగులతో తయారు చేసిన వస్త్రాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. శిక్షణ పొందినవారికి మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



వాసవ్య మహిళా మండలి పీడీ సునీతకు మొక్క అందజేస్తున్న మహిళలు

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కృత్తివెన్ను : కృత్తివెన్ను, లక్ష్మీపురం, చెరుకుమిల్లి ఉప విద్యుత్తు కేంద్రాల పరిధిలోని వినియోగదారులకు శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు 3 గంటల పాటు విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఎం.భాస్కరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బంటుమిల్లి : బంటుమిల్లి, అర్తమూరు విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో ఆయా గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పలు విద్యుత్తు లైన్లను సరిచేయడంతో పాటు, ఉపకేంద్రాలలో నిర్వహణ పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజా సమస్యలకే తొలి ప్రాధాన్యం

మచిలీపట్నంరూరల్, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూటమి ప్రభుత్వం ప్రజాసమస్యలకే తొలి ప్రాధాన్యం ఇస్తుందని జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. పల్లెపండగలో భాగంగా శుక్రవారం ఎన్.గొల్లపాలెం, తుమ్మలచెరువు, వాడపాలెం, కొత్తపల్లెతుమ్మలపాలెం గ్రామాల్లో సీసీ రోడ్లకు గోపు సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు.

శంకుస్థాపన కార్యక్రమాల్లో జడ్డు జగ్గయ్య, డొక్కా నిరంజనరావు, భావిరెడ్డి దానయ్య, తలారి నాగార్జునరావు, కంచర్లపల్లి సుబ్బారెడ్డి, మేడిశెట్టి రాజా, కూనపరెడ్డి యానాదిరావు, కూనపరెడ్డి రజని, ఒడుగు నాగపోతురాజు, ఒడుగు నాంచారయ్య పాల్గొన్నారు.



వాడపాలెంలో సీసీ రోడ్డు శంకుస్థాపనలో గోపు సత్యనారాయణ తదితరులు

బీచ్ రోడ్డులో కూలిన కల్వర్టు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



పంట కాలువపై కల్వర్టు ధ్వంసమై..

పోతిరెడ్డిపాలెం (మచిలీపట్నంరూరల్): మచిలీపట్నం-మంగినపూడి బీచ్ రోడ్‌లో పోతిరెడ్డిపాడు రహదారి అనుసంధాన ప్రాంతంలో పంట కాలువపై నిర్మించిన కల్వర్టు గురువారం అర్ధరాత్రి కూలిపోయింది. ఈ ఘటన కారణంగా భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మంగినపూడి బీచ్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రతినిత్యం వేల మంది సందర్శకులు వస్తుంటారు. బీచ్ రోడ్‌లో దాదాపు 30 గ్రామాల ప్రజలు కూడా ఈ రహదారినే ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం తేలికపాటి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు మధ్యలో కల్వర్టు కూలిపోగా కూలకుండా ఉన్న నాలుగు అడుగుల దారి నుంచి ప్రజలు ప్రయాణిస్తున్నారు. కల్వర్టు కూలిన సమాచారం తెలియగానే ఆర్అండ్‌బీ అధికారులు ఘటనా ప్రాంతాన్ని సందర్శించారు.

పది రోజుల్లో నిర్మిస్తాం

పంట కాలువపై పోర్టు నిర్మాణ సంస్థ మేఘా కంపెనీ సహకారంతో పది రోజుల్లో కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. అప్పటివరకు ప్రత్యామ్నాయ రహదారిని నిర్మిస్తాం. శనివారం సాయంత్రానికి ప్రత్యామ్నాయ రహదారిని సిద్ధం చేస్తాం.

- సురేష్, ఆర్అండ్‌బీ ఏఈ

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

నీటి కాలుష్యం పట్టదా..

పైపులైన్లకు లీకులు

నెలలు గడిచినా కదలరే

న్యూస్‌టుడే, పెడన

పెడనలో తాగు నీటి కాలుష్యం రోజురోజుకు పెరుగుతోంది. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పైపులైన్లకు తరచూ లీకులతో కాలుష్యానికి దారి తీస్తోంది. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం లీకులను అరికట్టడంలో వైఫల్యం కారణంగా ప్రజలకు కలుషిత నీటి బాధలు తప్పడం లేదు. దీంతో ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆహార, నీటి కాలుష్యంతో ప్రబలే టైఫాయిడ్ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.



ఆర్టీసీ బస్టేషన్ ఎదురుగా పైపులైన్‌కు భారీ లీకు

26 ఏళ్ల నాటి పైపులైన్లే..

పెడనకు తొలిసారిగా 1998లో రక్షిత నీటి పథకం అందుబాటులోకి వచ్చింది. అప్పట్లో ఏర్పాటు చేసిన ఆర్‌సీసీ పైపులైన్ల స్థానంలో కొత్త లైన్లు వేయలేదు. హెడ్ వాటర్ వర్క్స్ నుంచి బస్టాండు సెంటరులోని 1000 కేఎల్ రిజర్వాయర్‌కు శుద్ధి చేసిన నీటిని పంపింగ్ చేసే 250 ఎంఎం పైపులైనుకు గతేడాది పలుమార్లు లీకులు పడ్డాయి. ఈ లీకులను సరిచేసేందుకు కనీసంగా రెండు రోజులు సమయం పడుతోంది. ఫలితంగా తాగు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఇక పట్టణంలోని పలు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అప్పట్లో ఏర్పాటు చేసిన పైపులైన్లకు తరచూ లీకులు ఏర్పడుతున్నాయి. వీటిని సరి చేయడంలో ఇంజినీరింగ్ విభాగం దృష్టి సారించడం లేదని పురప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానిక 12-13 వార్డుల్లోని మఠం వీధి చెత్త డంప్ పక్కగా పైపులైనుకు భారీ లీకు పడినా స్పందన కరవైంది. ఇలా దాదాపు 25 కి.మీ పొడవునా విస్తరించిన పైపులైన్లలో దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఈలీకులు కన్పిస్తున్నాయి.



జ్వరాలతో బాధపడుతున్న ప్రజలు

గ్యాస్ పైపులతో మరింతగా..

రెండేళ్ల కిందట పెడనలో ఒక ప్రైవేటు సంస్థ వంట గ్యాస్ పైపులైన్లు ఏర్పాటు చేసింది. ఈ సమయంలో కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా పైపులైన్లు దెబ్బతిన్నాయి. కింద నీటి సరఫరా లైన్లు ఉండగా వాటిపైన గ్యాస్ పైపులను ఏర్పాటు చేశారు. గ్యాస్‌లైన్ల ఏర్పాటును ప్రజలు వ్యతిరేకించినా అప్పటి వైకాపా ప్రజాప్రతినిధులు ప్రజాభీష్టానికి విరుద్ధంగా అనుమతులు జారీ చేశారు. ఫలితంగా తాగునీటి పైపులైన్లకు పలు ప్రాంతాల్లో లీకులు ఏర్పడ్డాయి. ఈ లీకుల్లో కొన్నింటిని సరిచేయగా మరికొన్నింటిని అలాగే వదిలేశారు. ఫలితంగా ప్రజలు కాలుష్య నీటిని తాగాల్సిన దుస్థితి ఏర్పడింది.

లీకులను సరిచేస్తాం

అత్యవసర పనుల కింద లీకులను సరిచేస్తాం. ప్రజలకు శుద్ధనీటిని అందించాలన్నది మా లక్ష్యం. లీకులను గుర్తించాలని ఇప్పటికే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ప్రజలకు తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతుంటే 97017 16022కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఎమినిటీస్ కార్యదర్శులను కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తాం. రోజూ కుళాయిల వద్ద నీటి క్లోరిన్ శాతాన్ని తప్పనిసరిగా పరీక్షించాలని ఆదేశించాం. అలా చేయని కార్యదర్శులపై చర్యలు తప్పవు.

- కాగిత సీతారామాంజనేయులు, మున్సిపల్ ఏఈ

అటకెక్కిన రూ.93కోట్ల పథకం..

పెడనలో గత ప్రభుత్వ హయంలో చేపట్టిన రూ.93కోట్ల తాగు నీటి పథకం విస్తరణ పనులు అనతికాలంలోనే అటకెక్కాయి. ఏఐబీబీ నిధులతో చేపట్టిన ఈ పనులకు గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గుత్తేదారులు వాటిని నిలిపివేశారు. ఈ ప్రాజక్టులో భాగంగా పట్టణంలోని ప్రస్తుత ఆర్‌సీసీ పైపులైన్లను పూర్తిగా మార్చి డీఐ పైపులను ఏర్పాటు చేయాలన్నది లక్ష్యంకాగా ప్రభుత్వ విధానాలతో పథకం అటకెక్కింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పనులను పునః ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది.

స్కానింగ్ కేంద్రాలకు అనుమతులు తప్పనిసరి



స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: స్కానింగ్ కేంద్రాలు అన్నీ చట్ట పరంగా నమోదు చేసుకోవాలని డీఎంహెచ్‌వో గీతాబాయి అన్నారు. శుక్రవారం ఆమె నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి మాట్లాడారు. స్కానింగ్ కేంద్రాలకు సంబంధించిన అనుమతులన్నీ కచ్చితంగా ఉండాలన్నారు. స్కానింగ్ కోసం వచ్చిన గర్భిణుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తేలితే చట్టపరంగా కఠిన శిక్షలు అనుభవించాల్సి వస్తుందని, గుర్తింపును కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. స్కానింగ్ కేంద్రాలతో పాటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్, పాలిక్లినిక్స్, డెంటల్ క్లినిక్స్, ల్యాబ్‌లు, ఫిజియోథెరపీ క్లినిక్‌లు ఇలా అన్నీ నమోదు చేసుకోవాలన్నారు. బి.రాజేంద్రకుమార్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

(c) eenadu

గుడివాడ
•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

అధ్వానంగా జగనన్న కాలనీ


రావివారిపాలెంలో జగనన్న లేఔట్

రావివారిపాలెం(మోపిదేవి), న్యూస్‌టుడే: రావివారిపాలెం జగనన్న కాలనీ పరిస్థితి అధ్వానంగా ఉంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో 275మంది లబ్ధిదారులకు ఇక్కడ స్థలాలు ఇచ్చారు. గత ప్రభుత్వం ఇక్కడ ప్రధాన రహదారి వేయకుండా మూడేళ్లుగా కాలయాపన చేయడంతో ఇళ్ల నిర్మాణాలు నిలిచాయి. కాలనీలో కాలుపెట్టే అవకాశం లేకుండా పిచ్చిగడ్డి పెరిగి విషసర్పాలకు నిలయంగా మారింది. తాజాగా ప్రభుత్వం మారడంతో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు ఆశలు పెట్టుకున్నారు.

353 మందికి ఉచిత వైద్య సేవలు


మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

కూచిపూడి, న్యూస్‌టుడే : కూచిపూడిలోని రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయం వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఉచిత వైద్యసేవల విభాగంలో 353 మందికి రోగులకు వైద్యసేవలు అందించారు. ఆసుపత్రి ఏవో జె.హనుమకుమార్ పర్యవేక్షణలో అభివృద్ధి కమిటీ సభ్యుల సహకారంతో పలు విభాగాల వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. సహాయ ఏవో ప్రకాష్, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, అన్నే రాజేంద్రకుమార్, యార్లగడ్డ సుభాష్‌చంద్రబోష్ తదితరులు పాల్గొన్నారు.

నెక్లెస్ రోడ్డుకు మహర్దశ

రూ. 1.21 కోట్లతో నిర్మాణం

కుచికాయలపూడి(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే

రెండు దశాబ్దాల తర్వాత ఆ రహదారికి మహర్దశ పట్టింది.. మూడు గ్రామాల ప్రజలకు నిత్యం నరకంగా మారిన ఆ రహదారి అభివృద్ధిని కూటమి ప్రభుత్వం చేపట్టింది. అడుగడుగునా గుంతలతో రాళ్లు లేచిపోయి ప్రయాణమంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే పరిస్థితిని మార్చేందుకు రూ. కోటిపైనే నిధులు కేటాయించింది. శనివారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అదే నెక్లెస్ రోడ్డు. మండలంలోని కుచికాయలపూడి, పోలిమెట్ల, శేరికల్వపూడి గ్రామాలు పక్కపక్కనే వృత్తాకారంలో ఉంటాయి. ఈ మూడు గ్రామాల ప్రజలకు నిత్యం రాకపోకలు ఎక్కువ. ఈ గ్రామాలను కలిపే మార్గం గుండ్రంగా ఉండటంతో దీన్ని నెక్లెస్ రోడ్డుగా పిలుస్తారు. గతంలో మెటల్ రహదారిగా రాళ్లు లేచిపోయి వాహనదారులకు, ప్రయాణికులకు నరకం చూపించే ఈ జడ్పీ రహదారిని 2004లో నాటి మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు కృషితో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. తర్వాత పట్టించుకున్నవారే లేరు. 2, 3 సార్లు చిన్నపాటి మరమ్మతులు మినహా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయలేదు. దీంతో తారు మొత్తం పోయి రాళ్లు తేలి ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. మూడు గ్రామాల ప్రజల వేదనను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రత్యేకంగా ఉపాధి నిధులు రూ. 1.21 కోట్లు కేటాయించారు. దీంతో గాంధీఆశ్రమం-విన్నకోట ఆర్‌అండ్‌బీ రహదారి కూచికాయలపూడి ప్రారంభం నుంచి పనులు చేపట్టి పోలిమెట్ల మీదుగా శేరికల్వపూడి బస్‌షెల్టర్ వరకు 3.2 కి.మీ మేర బీటీగా అభివృద్ధి చేయనున్నారు. శనివారం ఎమ్మెల్యే రాము ఈ పనులకు శంఖుస్థాపన,పూజలు నిర్వహించనున్నట్లు తెదేపా నాయకుడు కొడాలి రామరాజు వెల్లడించారు.


కుచికాలయపూడి-పోలిమెట్ల మధ్య రహదారి దుస్థితి

రహదారులు ఇలా.. ప్రయాణం ఎలా?

నాగాయలంక, న్యూస్‌టుడే

వైకాపా పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వంతో అయిదేళ్లుగా గ్రామీణ రహదారులు కనీసం మరమ్మతులకు సైతం నోచుకోలేదు. చిన్నపాటి వర్షానికే రోడ్లపై గుంతల్లో నీరు

ఫోకస్

నిలిచిపోవడంతో బురదలోనే ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వక్కపట్లవారిపాలెం నుంచి భావదేవరపల్లి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. వర్షం వస్తే రోడ్లపై గుంతలు చెరువులను తలపిస్తున్నాయి. నాగాయలంక నుంచి సొర్లగొంది వెళ్లే ప్రధాన రహదారి తలగడదీవి శివారు నుంచి గణపేశ్వరం పెట్రోల్ బంకు వరకు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. బర్రంకులకు వెళ్లే మార్గం గుంతలమయంగా మారింది. కూటమి ప్రభుత్వంలోనైనా గ్రామీణ రహదారుల బాగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గుంతలమయంగా వక్కపట్లవారిపాలెం- భావదేవరపల్లి రహదారి


తలగడదీవి శివారు గణపేశ్వరం పెట్రోల్ బంకు వరకు అధ్వానంగా తయారై ఇలా..


గుంతలమయంగా బర్రంకుల ప్రధాన మార్గం

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

పురిటిగడ్డ(చల్లపల్లి), న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాలో పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు కావాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు పిలుపునిచ్చారు. పురిటిగడ్డ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం ఉద్యోగులకు అసోసియేషన్ తరపున ఓటరు నమోదు పత్రాలను అందజేశారు. డాక్టర్ జయరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చల్లపల్లి: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ తెలిపారు. శుక్రవారం చల్లపల్లిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులకు ఫారం-18 అందజేశారు.

ప్రజలకు అసౌకర్యం కలిగించొద్దు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: నివాస ప్రాంతాలకు దూరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని ఎక్సైజ్‌శాఖ అధికారులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. మద్యం దుకాణాల ఏర్పాటు విషయంలో ప్రజల అభ్యంతరాలు తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.

జస్టిస్ అంబటి లక్ష్మణరావు మృతికి సంతాపం

అవనిగడ్డ, న్యూస్‌టుడే : అలహాబాద్ హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అంబటి లక్ష్మణరావు ఆకస్మిక మరణ వార్త దిగ్భ్రాంతి కలిగించిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. లక్ష్మణరావు మృతికి సంతాపం తెలిపారు. ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు.

ప్రజలపై ట్రూఅప్ ఛార్జీల భారం దారుణం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్రం ప్రజలపై ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్తు సంస్థలు రూ.8114 కోట్ల భారం మోపేందుకు ప్రతిపాదించడం దారుణం అని, వెంటనే వాటిని తగ్గించాలంటూ సీపీఎం గుడివాడ కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు రోడ్డులోని విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ గుడివాడ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం చేసిన పనే నేడు తెదేపా కూటమి ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. విద్యుత్తు వినియోగదారులపై ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు రుద్ది అధిక భారం మోపడం దారుణం అన్నారు. తక్షణం ఈ అదనపు విద్యుత్తు ఛార్జీలు రద్దు చేయాలని లేదంటే పేదల పక్షాన పోరాటం ఉద్ధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పి.రజిని, రేపాని కొండ, గూడపాటి గోపాల్, లంకా సురేంద్ర, పి.ప్రభుదాసు, వెంకటేశ్వరరావు, సురేష్, సుబ్బారావు, కిరణ్ తదితరులున్నారు.


విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద సీపీఎం నేతల ధర్నా


స్టాల్స్ ఏర్పాట్లలో వివిధ శాఖల సిబ్బంది

న్యాయ సేవల శిబిరానికి ఏర్పాట్లు

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే : మొవ్వ మండవ జానకీరామయ్య సులోచన, క్షేత్రయ్య కల్యాణ మండపంలో ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న న్యాయ సేవల శిబిరం విజయవంతానికి వివిధ శాఖల అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పలు ప్రభుత్వ శాఖల అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులతోపాటు జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

కోడూరు(అవనిగడ్డ), న్యూస్‌టుడే: స్థానిక లక్ష్య పాఠశాల విద్యార్థులు ఇద్దరు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ వి.శివనాగరాజు తెలిపారు. పటమట జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలో పాల్గొన్న విద్యార్థులు పి.అయ్యప్ప, పి.దానియేలు, అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. క్రీడాకారులను కరస్పాండెంటు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.


క్రీడాకారులను అభినందిస్తున్న కరస్పాండెంటు, ప్రిన్సిపల్

జిల్లా స్థాయి కబడ్డీ..

కూచిపూడి, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ పోటీలకు 22 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మొవ్వ మండల ఫెడరేషన్ సమన్వయకర్త కూనపరెడ్డి మోహనకృష్ణచంద్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 21వ తేదీన జగ్గయ్యపేటలో జరిగే కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక పామర్రు మండలం నల్లగుంట గురుకుల పాఠశాల ఆవరణలో జరిగిందన్నారు. అండర్-14, అండర్- 17లలో బాలబాలికల విభాగాల్లో ఎంపిక చేసినట్లు వివరించారు.


పోటీలకు ఎంపికైన బాలికలు

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే : గుడివాడ పట్టణంలోని పలు ప్రాంతాలు, మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 19వ తేదీన ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ సరఫరా నిలిపేస్తున్నట్లు డీఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పెద ఎరుకపాడు, బేతవోలు, కార్మికనగర్, నిమ్మతోట, ఇందిరానగర్ కాలనీ, వాంబే కాలనీ, రామనపూడి, టిడ్కో కాలనీ, బిళ్లపాడు, దింటకుర్రు, శేరివేల్పూరు, సిద్దాంతం గ్రామాల్లో శనివారం విద్యుత్తు ఉండదన్నారు.

పమిడిముక్కల: మండలంలోని రెండు విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ తెలిపారు. **తోట్లవల్లూరు, న్యూస్‌టుడే :** మండలంలోని వల్లూరుపాలెం, యాకమూరు, దేవరపల్లి గ్రామాల్లోని విద్యుత్తు సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ఏఈ దేవదాసు శుక్రవారం తెలిపారు.

కల్యాణ మస్తు సాయం అందజేత

పామర్రు, న్యూస్‌టుడే : కల్యాణమస్తు పథకంలో భాగంగా మండలంలోని ఎలకుర్రు గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వరరావు కుమార్తె హరిచందనకు నాలుగు గ్రాముల బంగారు నాణేన్ని కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టుబోర్డు డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, సంఘ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పాలశీతలీకరణ మేనేజర్ సి.హెచ్.గోపీనాథ్, సూపర్‌వైజర్ బాషా, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.


బంగారు నాణెం అందిస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా బోర్డు డైరెక్టర్ కృష్ణారెడ్డి

హిందూ దేవాలయాలను పరిరక్షించుకోవాలి

అవనిగడ్డ, న్యూస్‌టుడే : హిందూ దేవాలయాలను పరిరక్షించుకోవాలని విశ్వహిందూ పరిషత్ న్యూదిల్లీ, సమరసత కార్యదర్శి దేవ్ బాయ్ రావత్ అన్నారు. మత మార్పిడులను నిరోధించాలన్నారు. శుక్రవారం అవనిగడ్డలో వీహెచ్‌పీ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో తూర్పు విభాగం ప్రాంత ఉపాధ్యక్షుడు పి.వెంకటస్వామి నాయుడు, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనాథ్, మొవ్వ రఘుశేఖరప్రసాద్, బసవశంకర్‌రావు, సుబ్రహ్మణ్యం, యుగంధర్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

కదిలొచ్చిన స్నేహితులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే : అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కోడూరు మండలం, నక్కవానిదారి గ్రామానికి చెందిన పచ్చా వీరబాబు కుమారుడు లోకేశ్ స్థానిక ఎస్వీఎల్ క్రాంతి డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో బీకాం మూడో సంవత్సరం విద్యార్థినులు నిత్యావసర వస్తువులు, కూరగాయలు శుక్రవారం కళాశాలలో అతడికి అందించారు. కరస్పాండెంటు దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపల్ బాబూ రాజేంద్ర ప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్వీ.నాగేశ్వరరావు విద్యార్థినులను ప్రశంసించారు.

మార్చురీ బాక్స్ అందజేత

లంకపల్లి(ఘంటసాల), న్యూస్‌టుడే : లంకపల్లిలో యార్లగడ్డ వెంకట సుబ్బయ్య-మీనమ్మ దంపతులు జ్ఞాపకార్థం కుమారుడు యార్లగడ్డ నాగ మునేశ్వరరావు రూ.70వేల విలువైన మార్చురీ బాక్స్‌ను గ్రామ పంచాయతీకి శుక్రవారం అందజేశారు. నాగ మునేశ్వరరావు కుటుంబసభ్యులు వెంకట కిరణ్, సర్పంచి డి.విజయలక్ష్మి, ఈవో కె.ఎన్ నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదంలో వరిగడ్డివామి, చావిడి దగ్ధం

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాల దిరిశంవానిగూడెంలో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి కొడాలి భాస్కరరావుకు చెందిన 5 ఎకరాలు వరిగడ్డివామి, పశువుల చావిడి దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో 3 గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. మొవ్వ అగ్నిమాపక ఇన్‌ఛార్జి అధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు ఆర్పివేశారు. అగ్నిప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

గ్రామాల్లో సమగ్ర అభివృద్ధికి కృషి

కోడూరు(అవనిగడ్డ), న్యూస్‌టుడే : పల్లె పండగ ద్వారా గ్రామాల్లో సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోడూరు మండలంలోని కోడూరు, లింగారెడ్డిపాలెం, హరిపురం గ్రామాల్లో సిమెంటు రహదారుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. లింగారెడ్డిపాలెంలో రూ.52.90 లక్షలు, హరిపురంలో గ్రామంలో రూ.61.40 లక్షలు, కోడూరులో రూ.55 లక్షలతో సిమెంటు రహదారులు నిర్మించనున్నారు. మండలంలో రూ.4.47 కోట్లతో 68 సిమెంటు రహదారులు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్, పార్టీ మండల అధ్యక్షులు మర్రే గంగయ్య, జి.శేషుబాబు, తెదేపా మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, డీఈఈ (పంచాయతీరాజ్) పి.సురేష్‌బాబు, ఎంపీడీవో సుధాప్రవీణ్, ఆయా గ్రామాల సర్పంచులు యర్రంశెట్టి కనకదుర్గ, వెర్రి పావని, సనకా శైలజ, మాజీ సర్పంచి కడవకొల్లు నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.


హరిపురంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, పక్కన మహిళలు

ప్రజా సంక్షేమమే లక్ష్యం

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బల్లిపర్రు ఎస్సీ కాలనీలో మూడు, ఓసీ కాలనీలో ఒక సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచి నిమ్మగడ్డ సుధాకర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తమ్మారెడ్డి సంజీవరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కలపాల చంటి, కార్యదర్శి వేదాంతం గోపాలకృష్ణ, తమ్మారెడ్డి రామకృష్ణ, కలపాల నాని బాబు, నిమ్మగడ్డ జైశేఖర్, ఎంపీడీవో జ్యోతి, తహశీల్దార్ జి.రవికాంత్, పీఆర్ ఏఈ రామారావు పాల్గొన్నారు.


బల్లిపర్రులో రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పక్కనే నాయకులు

అభివృద్ధి పనులకు శ్రీకారం

చినగొన్నూరు(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే : పల్లె పండగ కార్యక్రమంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చినగొన్నూరు, శేరిదగ్గుమిల్లి, పురిటిపాడు, కట్టవానిచెర్వు, కూరాడలలో రూ. 76.78 లక్షలతో చేపట్టనున్న సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాము, జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ శాయన పుష్పావతి శంకుస్థాపన చేశారు. శాయన సూర్యప్రసాదరావు, జన్ను శివకుమార్, బెజవాడ వెంకయ్య, బొర్రా ప్రసాద్, సర్పంచులు జన్ను లక్ష్మీరాణి, కాగిత నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే : గుడివాడ మండలంలోని రామనపూడి, తటివర్రు గ్రామాల్లో రూ.21 లక్షలు, రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నియోజకవర్గ జనసేన పార్టీ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, తెదేపా మండల అధ్యక్షుడు వాసే మురళీ, వెనిగండ్ల రామకృష్ణ (నాని) శంకుస్థాపన చేశారు. తెదేపా సీనియర్ నేత లింగం ప్రసాద్, సర్పంచులు మీగడ ప్రేమ్‌కుమార్, నిర్మల కుమారి, అధికారులు బి.వై.విష్ణు ప్రసాద్, రవి, సూరిబాబు, అట్లూరి వెంకటేశ్వరరావు, నాయకులు ఇంటూరు గజేంద్ర, కైలా రంజిత్, కైలా కాళీదాసు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడి న్యూస్‌టుడే : మండలంలోని నాగాపురం, పాములపాడు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులు, తెదేపా నాయకులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. తెదేపా సీనియర్ నాయకులు కె.జయరాజు, నాగదేశి సునీత నాగాపురం సర్పంచి నాగదేశి సుబ్రహ్మణ్యం, రాజ్‌కుమార్, నాగదేశి కళ్యాణ్‌రావు, విజయప్రకాష్, ఎన్.జయరాజు, కార్యదర్శులు వి.సాగరరాణి, లావణ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : మండలంలోని చాగంటిపాడులో రూ.14.70 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం తెలుగు యువత నాయకుడు కళ్లం వంశీకృష్ణారెడ్డి శంరుస్థాపన చేశారు. తెదేపా నాయకులు కళ్లం కోటిరెడ్డి, మట్టా అమృతబాబు, నాగేశ్వరనాయక్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల, న్యూస్‌టుడే: వేములపల్లి బీసీ రూ.8 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు తెదేపా మండల అధ్యక్షుడు టి.చౌదరిబాబు, ఉప సర్పంచి కె.రాంబాబు, ఎస్.రామకృష్ణ, పి.నరేష్, ఈవో సురేష్ శుక్రవారం భూమిపూజ చేశారు.


చినగొన్నూరులో శంకుస్థాపన చేస్తున్న రాము, పుష్పావతి తదితరులు

గుంతలకు మరమ్మతులు

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని రిమ్మనపూడి నుంచి కొండాయిపాలెం వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. స్థానిక తెదేపా నేతలు విషయాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే శుక్రవారం పది ట్రక్కుల నల్ల కంకర డస్టును సరఫరా చేశారు. దీంతో గ్రామ శివారు జేపీగూడెం నుంచి రిమ్మనపూడి వరకు రోడ్డుపై పడిన గుంతల్లో పోయించి చదును చేశారు. దీంతో ప్రయాణానికి కొంత వెసులుబాటు కలిగిందని ప్రజలు పేర్కొంటున్నారు.


డస్టుని గుంతల్లో అన్‌లోడ్ చేస్తున్న ట్రాక్టర్

వైద్య సేవల పరిశీలన

జమీగొల్వేపల్లి(పామర్రు గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని జమీగొల్వేపల్లి పీహెచ్‌సీని శుక్రవారం కేంద్ర బృందం సందర్శించింది. కార్యక్రమంలో ఐవీఏ ఆడిట్ బృంద అధికారిణి జైత్ర, సిబ్బంది రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. ఆరోగ్య కేంద్రంలో అన్ని విభాగాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ కార్యక్రమాధికారి డాక్టర్ హిమబిందు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ టి.వరప్రసాద్, డాక్టర్ చరణ్‌చంద్, సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణమే నూతన పీఆర్సీ ఇవ్వాలి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే నూతన పీఆర్సీ ఇవ్వాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు పి.రాజారాయల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఏలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, సరెండర్ లీవ్ నగదు తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు.

రేపు నేత్ర వైద్య శిబిరం

నాగాయలంక: సుదర్శి మానవత సేవా సంస్థ సహకారంతో స్థానిక మారుతి విద్యానికేతన్ వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు తలశిల రఘుశేఖర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కంటి పరీక్షలు ఉంటాయన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే : ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులలో ఉత్తమ క్రమశిక్షణ, జాతీయ భావం ఏర్పడుతుందని అక్కినేని నాగేశ్వరరావు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె.ఎస్.అప్పారావు పేర్కొన్నారు. స్థానిక ఏఎన్ఆర్ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ ఎంపికలు నిర్వహించారు. మచిలీపట్నం 16వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సన్నార్ సింగ్ పర్యవేక్షణలో 21 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎల్.ఆర్.కె.ప్రసాద్, కోశాదికారి పర్వతనేని కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్, వైస్ ప్రిన్సిపల్ బిఎస్ఎస్.పద్మజ, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎమ్‌డి.సలీం తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులు

వరద బాధితులకు నిత్యావసర సరకులు

ఎదురుమొండి(నాగాయలంక), న్యూస్‌టుడే : మండల పరిధి ఎదురుమొండి దీవుల్లోని ఏసుపురం, కృష్ణాపురం, బ్రహ్మయ్యగారిమూల, ఎదురుమొండి గ్రామాల్లోని 1,000 మంది వరద బాధితులకు దాతలు చేయూత అందించారు. 'ఏ జొమాటో గివ్ బ్యాక్ ఫీడింగ్ ఇండియా' సహకారంతో అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.80 వేల విలువైన నిత్యావసర సరకులను అసిస్ట్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఎంవీ రామారావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి కన్నా సుధాకీర్తన, వెంకట్రావు, జి.కనకదుర్గ, రాణి, తదితరులున్నారు.




వెంట్రప్రగడ జడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీవైఈఓ పద్మారాణి

క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలి

పెదపారుపూడి : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య నేర్చుకోవాలని డీవైఈఓ పద్మరాణి అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను తెలుసుకొన్నారు. 10వ తరగతి విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా బోధించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని, రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు కె.హరికిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవ ప్రమేయం లేకుండానే సాంకేతిక అభివృద్ధి

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: రానున్న కాలంలో మనిషి ప్రమేయం లేకుండానే ఏఐ, ఎంఎల్ సాంకేతిక సహాయంతో యంత్రాలు పరుగులు తీస్తూ ప్రపంచం ముందడుగు వేస్తుందని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్(ఇండియా-ఐఈఐ) రాష్ట్ర సెంటర్ ఛైర్మన్ డాక్టర్ చింతమనేని వెంకటశ్రీరాం పేర్కొన్నారు. స్థానిక ఎస్ఆర్‌జీఈసీలో రెండు రోజులు పాటు వివిధ కళాశాలల అధ్యాపకులకు ఎంపవరింగ్ ఇంజినీర్స్ త్రూ అడ్వాన్స్‌డ్ ఏఐ, ఎంఎల్ టెక్నాలజీస్ అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఐ, ఎంఎల్‌లకు సంబంధించిన వివిధ సంఖ్యాధారిత శాస్త్ర గణాంకాలు, నిరూపిత అంశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధ్యాపకులకు ఐఈఐ రాష్ట్ర కార్యదర్శి దేవీకుమార్, డేటా సైంటిస్ట్ ప్రణయ్‌కుసుమ వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.కరుణకుమార్, వైస్ ప్రిన్సిపల్స్ పి.కోదండరామారావు, ఎంఆర్‌సీహెచ్.శాస్త్రి, డైరెక్టర్లు ఎం.కామరాజు, ప్రసాద్‌తోపాటు పి.రవీంద్రబాబు, నాగమణి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఈఐ రాష్ట్ర ఛైర్మన్ చింతమనేని వెంకటశ్రీరాం

(c) eenadu

పెనమలూరు
• పెనమలూరు • గన్నవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

? కానూరు గాంధీ బొమ్మసెంటర్‌లో దోమలు విపరీతంగా ఉన్నాయి. **- అన్నపూర్ణ, కానూరు.**
✔ సిబ్బందిని పంపి నివారణ మందు పిచికారీ చేయిస్తాం.
? పోరంకి రామాపురంకాలనీ వెళ్లే రోడ్డులో పిచ్చిమొక్కలు పెరిగి పాములు, విష పురుగులు తిరుగుతున్నాయి.
- వణుకూరు నాగేశ్వరరావు, పోరంకి.
✔ సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
- పి.భవానీప్రసాదు, కమిషనర్, తాడిగడప పురపాలకసంఘం
–కానూరు, న్యూస్‌టుడే

విద్యా సామగ్రి అందజేత
కంకిపాడు గ్రామీణం: సంచార జాతుల పిల్లలు విద్యాభ్యాసం చేసేందుకు వీలుగా ప్రభుత్వం కృషిచేయాలని తెదేపా సీనియర్ నాయకుడు కిషోర్‌బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పునాదిపాడు శివారులోని చెరువుకట్టపై నివాసం ఉంటున్న కుటుంబాల్లోని చిన్నారుల చదువుకోసం చాపలు, బోర్డు, పుస్తకాలు, బోధనా సామగ్రి తదితరాలను అందజేశారు.

‘ప్రజలపై విద్యుత్తు బిల్లుల భారం’
గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలపై అధిక విద్యుత్తు ఛార్జీలతో ప్రభుత్వం పెను భారం మోపుతోందని సీపీఎం నాయకులు అన్నారు. ఎన్నికల ముందు విద్యుత్తు ఛార్జీలు పెంచమని హామీలిచ్చి సర్దుబాటు ఛార్జీల పేరుతో భారం మోపేందుకు అన్ని చర్యలు చేపట్టడంపై గన్నవరం సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. సర్దుబాటు పేరుతో రాష్ట్ర ప్రజలకు రూ.23 వేల కోట్ల భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు, నాయకులు తాతబ్బాయి, మల్లంపల్లి ఆంజనేయులు, మిరపా నాగేశ్వరరావు, సూరగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం నాయకుల ఆందోళన

నియామకాలతో సమస్యలు దూరం
ఏఎంసీ, సీహెచ్‌సీల పాలకవర్గాలపై కసరత్తు

కంకిపాడు, న్యూస్‌టుడే

‘**కూ**టమి’ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటడంతో నియామక పదవులపై కసరత్తు జరుగుతోంది. పెనమలూరు, కంకిపాడు మండలాలకు చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ), సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) పాలకవర్గాలు ప్రధానమైనవి. సీహెచ్‌సీ ఛైర్మన్ పదవి కోసం పోటీ పడుతోన్న తెదేపా నాయకులు అధికంగా ఉన్నారు. తెదేపా హయాంలో (2014-19) వరకు పాలకవర్గంలో ఛైర్మన్ సహా ఐదుగురు సభ్యులుండేవారు. వైకాపా ప్రభుత్వం ఈ సంఖ్యను మూడుకు కుదించింది. ఎక్కువ గ్రామాలకు ప్రాతినిధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో వలె ఐదుకు పెంచే సూచనలు కనపడుతున్నాయి. ఏడాది కిందట సుమారు రూ.3.5 కోట్లతో కంకిపాడు సీహెచ్‌సీకి విశాలమైన కొత్త భవనాలతోపాటు పూర్తి స్థాయిలో వసతులు సమకూర్చారు. వైద్యులు, సిబ్బందితోపాటు వైద్య సేవలు ఉపయోగించుకునేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీని నిర్వహణపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ అంతంతమాత్రంగా ఉంది. సేవల్లో లోటుపాట్లు, మందుల కొరత తదితర అంశాలపై పారదర్శకత, జవాబుదారీతనం నామమాత్రమైంది. ఇదే పాలకవర్గం ఉంటే వీటిని సరిదిద్దే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


పెనమలూరు ఏఎంసీ కార్యాలయం

ఆదాయం ఉన్నా..
కంకిపాడు కేంద్రంగా ఉన్న పెనమలూరు ఏఎంసీ వార్షికాదాయం సుమారు రూ.2.5 కోట్ల వరకు ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఈ నిధుల్లో సింహ భాగం సీఎఫ్‌ఎంసీ (ప్రభుత్వ ఖాతా)లో జమయ్యాయి. మిగతావి ఉద్యోగుల జీతభత్యాలకు సరిపోయేవి. ఇంత ఆదాయం వస్తున్నా గత ఐదేళ్లలో ఒక డొంక రహదారి బాగుజేత, రైతులకు ఉపయోగపడే ఒక్క భవన నిర్మాణం, అవగాహన సదస్సుల నిర్వహణ, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, యంత్ర పరికరాల అందజేత ఊసే లేదు. ఇక పాలకవర్గాలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి. రూ.100 కోట్ల విలువైన మార్కెట్ యార్డ్ చిట్టడవిలా తయారైంది. రైతు బంధు అమలుకూ బ్రేకులు పడ్డాయి. గిడ్డంగులను అద్దెకు ఇచ్చారు. కృష్ణవేణి పాల ఉత్పత్తిదారుల సహకారం సంఘానికి లీజుకు ఇచ్చిన 30 సెంట్ల స్థలం, దానిలోని ఆర్‌సీసీ గిడ్డంగికి అద్దె బకాయిలు సుమారు రూ.30 లక్షల వరకు ఉన్నాయి. ఆవరణ పాముల పుట్టలతో నిండింది. 10 రోజుల క్రితం వరకు వీధి దీపాలు వెలగలేదు. గేట్లు, వ్యవసాయ ఉత్పత్తులు ఆరబోసుకునే ప్లాట్‌ఫారాలు, షెడ్లు ధ్వంసం అయ్యాయి. వీటన్నిటినీ గాడిలో పెట్టడానికి చిత్తశుద్ధి, అంకిత భావంతో పనిచేసే పాలకవర్గం అవసరం ఎంతైనా ఉంది.

భూ రీసర్వే తప్పులపై గ్రామ సభలు
కంకిపాడు గ్రామీణం, కంకిపాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న భూరీసర్వే విధానంలో ప్రస్తుత తెదేపా ప్రభుత్వం విధివిధానాలను జారీ చేసినట్లు తహసీల్దారు భావన్నారాయణ తెలిపారు. గతంలో తలెత్తిన సమస్యలపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉప్పులూరులో ఈ నెల 24, కొనతనపాడు 25, వేల్పూరు 26, తెన్నేరు 28, ప్రొద్దుటూరు 29, ఈడుపుగల్లు 30వ తేదీల్లో, పునాదిపాడులో నవంబర్ 01వ తేదీ, దావులూరు 02, కంకిపాడు 04, నెప్పల్లి 05, చలివేంద్రపాలెం 06వ తేదీల్లో నిర్వహించే సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నవంబరు 13 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వి.నాగభూషణం తెలిపారు. శనివారం కొయ్యూరులో సభ నిర్వహిస్తున్నామన్నారు.

22 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు
కంకిపాడు, న్యూస్‌టుడే : కంకిపాడు మండలంలో ఈ నెల 22 నుంచి నాలుగు రోజుల పాటు సచివాలయ స్థాయిలో నిర్వహించనున్న ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అనూష ఒక ప్రకటనలో సూచించారు. 22, 23వ తేదీల్లో ఈడుపుగల్లు-2, మంతెన, గొడవర్రు, 24, 25వ తేదీల్లో వేల్పూరు, కోలవెన్ను, దావులూరు సచివాలయాల్లో ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు
ఉయ్యూరుగ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్లు మరమ్మతుల నేపథ్యంలో పెద ఓగిరాల విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని చిన ఓగిరాల, పెద ఓగిరాల, ఆకునూరు గ్రామాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

In the Court of the I Addl Junior Civil Judge At Vijayawada OS No.1809/2022
Between:
Kancharla Tirupathaiah ... **Plaintiff**
And
Bandaru Naga Malleswari ... **Defendent**
To,
Bandaru Naga Malleswari
W/o.Surya Prakasarao
R/o: D.No. 6-88, Bapulapadu Village
Krishna District
[illegible]
//By Order//
K.Ravi Kumar
Advocate
Vijayawada
విజయవాడ ది: 18-10-24



రోడ్డుకు మరమ్మతులు చేపట్టరూ..!
కానూరు మన కల్యాణ వేదిక రోడ్డు (యడ్లపల్లి సత్యం గారి వీధి) అధ్వానంగా మారి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు ఈ గుంతలల నీరు చేరి బురదమయంగా అటుగా వెళ్లే వారు జారిపడుతున్నారు. రోడ్డు నిర్మాణానికి తాము కొంత మొత్తం విరాళాలుగా అందించడానికి సిద్ధంగా ఉన్నామని, మిగిలినవి ప్రభుత్వం సమకూర్చి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కానూరు**

అందుబాటులో నాణ్యమైన టమాటాలు
ఈనాడు కథనానికి స్పందన

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గన్నవరం రైతు బజారులో శుక్రవారం నుంచి నాణ్యమైన టమాటాలు అందుబాటులోకి వచ్చాయి. వీటి నిల్వలు వినియోగదార్ల అవసరాలకు సరిపడా లేకపోవడం, నామమాత్రంగా విక్రయించేవి కూడా నాసిరకంగా ఉండటంపై ‘మార్కెట్లో టమాటాల కొరత’ శీర్షికన శుక్రవారం ‘ఈనాడు’ వార్త ప్రచురించింది. దీంతో స్పందించిన రైతుబజారు ఎస్టేట్ అధికారి చంద్రమోహన్ అన్ని స్టాళ్లల్లోనూ టమాటా నిల్వలు పెట్టించారు. సరకు నాణ్యతను కూడా పరిశీలించారు. వినియోగదార్లకు ఇబ్బంది లేకుండా టమాటాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు ‘న్యూస్‌టుడే’కు తెలిపారు.




అలంకరణలో స్వామి, అమ్మవారు


దీపాలు వెలిగించిన మహిళలు

వైభవం.. వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవం
పెద ఓగిరాల(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాన్ని పెద ఓగిరాలలో గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగించారు. రాత్రి ఆలయం ప్రాంగణంలో మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు.

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు: విజయవాడ
IA No.631/2022 in OS No.1809/2022
Between:
Kancharla Tirupathaiah - **Petitioner**
And
Bandaru Naga Malleswari - **Respondent**
To,
Bandaru Naga Malleswari
W/o. Surya Prakash Rao
R/o D.No.6-88, Bapulapadu Village, Krishna (Dt)
[illegible] ...గాని, లేక మీ తరపు న్యాయవాది ద్వారా తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
కొండపల్లి రవికుమార్
పిటీషనర్ తరపు న్యాయవాది, విజయవాడ

రద్దీ లేని ప్రాంతాల్లోనే టపాసుల విక్రయ దుకాణాలు
యనమలకుదురు (పెనమలూరు), న్యూస్‌టుడే: తాడిగడప పురపాలిక పరిధిలో దీపావళి టపాసుల విక్రయ దుకాణాలకు రద్దీ లేని ఖాళీ ప్రదేశాల్లోనే అనుమతులిస్తామని పురపాలిక కమిషనర్ పి.భవానీప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనావాసాలు, రద్దీ ప్రదేశాలు, జాతీయ రహదారుల వెంట వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. దీని వల్ల ట్రాఫిక్ అంతరాయాలు ఉండవని పేర్కొన్నారు.

కోడి పందేలు ఆడుతున్న 29 మంది అరెస్టు
కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో కోడిపందేలు ఆడుతున్న సమాచారంతో కంకిపాడు పోలీసులు దాడులు నిర్వహించారు. శుక్రవారం కంకిపాడు ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో కోడిపందేలు ఆడుతున్న 29 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రెండు కోళ్లు, 10 కత్తులు, రూ.25040 నగదు, 8 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

స్కానింగ్ కేంద్రాలకు అనుమతులు తప్పనిసరి
మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: స్కానింగ్ కేంద్రాలు అన్నీ చట్ట పరంగా నమోదు చేసుకోవాలని డీఎంహెచ్‌వో గీతాబాయి అన్నారు. శుక్రవారం ఆమె నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి మాట్లాడారు. స్కానింగ్ కోసం వచ్చిన గర్భిణుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తేలితే చట్టపరంగా కఠిన శిక్షలుంటాయని హెచ్చరించారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ
కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ప్రొద్దుటూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటారు. ఈనెల 17న విజయవాడలోని పడమటలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో ఒ.జ్యోతి, పి.యోగశ్రీ సత్తా చాటి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయిని అరుణకుమారి తెలిపారు. వ్యాయామోపాధ్యాయుడు రమేష్‌ను సత్కరించారు.


ప్రొద్దుటూరు: విద్యార్థులతో ఉపాధ్యాయులు

కరాటేలో సత్తా..
ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఇటీవల చెన్నైలో నిర్వహించిన మూడో ఆలిండియా కరాటే ఛాంపియన్‌షిప్-2024లో పట్టణంలోని ఎం.కె.ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరిని అభినందిస్తూ శుక్రవారం వ్యాపారవేత్త నూకల సాంబశివరావు అభినందించారు. బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ ఎం.కె.వెంకటేశ్వర బాబు, మణికట్టన్ నారాయణ్, శిక్షకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీకి ఎంపిక..
ఉయ్యూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) వాలీబాల్ పోటీలకు ఉయ్యూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు కె.జ్యోత్స్నాదేవి శుక్రవారం తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో ఆర్.ప్రజ్వల్, అండర్-14 బాలుర విభాగంలో జి.జీవన్‌కుమార్ ఎంపికయ్యారన్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వ్యాయామ ఉపాధ్యాయులు జీవీ రమణ, జీఆర్‌ఎం లాల్ తెలిపారు.


విద్యార్థులతో హెచ్‌ఎం జ్యోత్స్నాదేవి, రమణ, లాల్

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోండి
పోరంకి,న్యూస్‌టుడే: ప్రభుత్వం వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పోరంకి సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీ ప్రకారం రూ. 10000లు జీతం ఊసే లేదన్నారు. నాయకులు మస్తాన్‌వలి, సరళ, వెంకటేశ్వర్లు, ఎం.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంతిమయాత్ర
శ్రీమతి పిన్నమనేని లీల గారు
ది. 18-10-2024 శుక్రవారం స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము. శోకతప్త హృదయాలతో..

శ్రీమతి పిన్నమనేని (కోనేరు) లీల గారు
Retd. ప్రధానోపాధ్యాయిని, చిల్డ్రన్స్ మాంటిస్సోరి ప్రాథమిక పాఠశాల, విజయవాడ
జననం: 15-7-1945, మరణం: 18-10-2024
భర్త
పిన్నమనేని రామారావు
మరియు
కుటుంబ సభ్యులు
అంతిమయాత్ర: ది. 19-10-2024 శనివారం ఉ॥ 9 గంటలకు విజయవాడ సూర్యారావుపేటలోని మా స్వగృహము నుండి బయలుదేరును. ☎ 93921 31746
ఆమె కోరిక మేరకు పార్థివ దేహమును పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీకి ఇవ్వడమైనది

ప్రకటన
నా క్లయింటున్నూ విజయవాడ, యనమలకుదురు మున్సిపాలిటీ, డోరు నెం.11-12 కాపురస్థులున్నూ అయిన కోటనాగలక్ష్మి, భర్త కోట శ్రీనివాసరావు గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియచేయునది. ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి నా క్లయింటు భర్తగారైన కోట శ్రీనివాసరావు గారికి చెంది వారు తమ జీవిత కాలములో సంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవించి ది. 09-04-2019వ తేదీన పరమపదించగా ఆ తదనంతరము షెడ్యూలాస్థిని నా క్లయింటు ఏకైక వారసురాలిగా స్వాధీనపరచుకొని సర్వ హక్కులతో అనుభవించుచున్నారు.
ఇట్టి స్థితిలో వంగూరు రాధా రుక్మిణి, భర్త. రాజ్‌కుమార్ అను ఆమె తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి నా క్లయింటు భర్తను తన భర్తగా ప్రచారము చేసికొనుచూ దావా ఓ.యస్.నెం.1903/2019, ఓ.యస్.నెం. 1722/2021, ఓ.యస్.నెం. 43/2021, ఓ.యస్.నెం. 1811/2022 దావాలు దాఖలు చేసికొనియున్నారు. సదరు దావాలన్నియున్నూ కోర్టులో పెండింగులో యున్నవి. సదరు వంగూరు రాధా రుక్మిణీ షెడ్యూలాస్థికి సంబంధించి తప్పుడు దస్తావేజులు సృష్టించి కొంతమంది అసాంఘిక శక్తులతో అన్యాక్రాంతము చేసి నా క్లయింటుకు నష్టము కలుగచేయ ప్రయత్నించుచున్నదని నా క్లయింటు దృష్టికి తెలియవచ్చినది. కాబట్టి ఎవ్వరైననూ షెడ్యూలాస్థికి సంబంధించి ఏవిధమైన లావాదేవీలు జరిపిననూ అవి ఏమియునూ నా క్లయింటును ఏవిధముగానూ బైండు చేయజాలవనియు మరియు నా క్లయింటు సదరు వ్యక్తులపై సివిల్ మరియు క్రిమినల్ చట్టప్రకారము చర్యలు తీసుకొనబడునని యిందుమూలముగా హెచ్చరించడమైనది.
షెడ్యూలు: కృష్ణాజిల్లా, విజయవాడ తూర్పు, జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా రామవరప్పాడు గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన రామవరప్పాడు గ్రామకంఠం ఆర్.యస్.నెం. 121/6, అస్సెస్మెంట్ నెం. 100, డోరు నెం. 1-85 దాఖలా స్థిరాస్తికి హద్దులు: **తూర్పు:** గల్లీ బజారు, **దక్షిణం:** కళ్యాణం కుటుంబరావుగారి ఆస్తి, **పడమర:** కోడెబోయిన కృష్ణమోహనరావు గారి ఆస్తి, **ఉత్తరం:** పంచాయతీ బజారు. ఈ నాలుగు హద్దుల మధ్య గల చ.గ. 72లు అందు జి+2 అంతస్తులు గల బిల్డింగ్.
ఇట్లు **కొటారి సుబ్రహ్మణ్యం,** అడ్వకేట్
ఇంటి నెం: 65-6-5, ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర, పటమట, విజయవాడ-10
విజయవాడ, తేది: 18-10-2024 **Cell No: 99081 59448**

పోషకాహారంతో ఆరోగ్యం
పోరంకి,న్యూస్‌టుడే: పోరంకి బీజేఆర్ నగర్ అంగన్వాడీ కేంద్రం నందు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామాజిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు తప్పక ఇవ్వాల్సిన ఎక్కువ పోషకాలు ఉండే పోషకాహారం గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అవగాహన కల్పించారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు లక్ష్మి ప్రసన్న, అంగన్వాడీ కార్యకర్త వి.యమునారాణి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి

20న కంటి వైద్య శిబిరం
పెనమలూరు, న్యూస్‌టుడే: ‘తానా’ ఆధ్వర్యాన ఈ నెల 20వ తేదీన పెనమలూరులో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ‘తానా’ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ ఠాగూర్ మల్లినేని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ శిబిరంలో ప్రముఖ ఆసుపత్రులకు చెందిన వైద్యులు సేవలందిస్తారని చెప్పారు.

ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్టులో నేడు..
గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్టులో ఈ నెల 19న శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు డైరెక్టర్ పరదేశి తెలిపారు. ఆస్టర్ రమేష్ ఆసుపత్రి విజయవాడ వారి సహకారంతో నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారని చెప్పారు. శిబిరంలో గుండె, మెదడు, ఎముకలు, ఊపిరితిత్తులు, రుమటాలజీ(కండరాలు, కీళ్ల వాపులు), సాధారణ వ్యాధుల నిపుణులతో ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ సేవలను పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9505012312 నంబరులో సంప్రదించాలని వెల్లడించారు.

శంకుస్థాపనకు వచ్చి.. అస్వస్థతకు గురై
గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: కేసరపల్లి నుంచి చిన్నఅవుటపల్లి వరకు జాతీయ రహదారి వెంట చేపట్టే గ్రీనరీ, బ్యూటిఫికేషన్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ప్రిన్సిపల్ ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్ట్ సత్యనారాయణ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఉదయం ఎండ వేడిమి కారణంగా రక్తంలో చక్కెరస్థాయిలు తగ్గుముఖం పట్టడంతో ఒక్కసారిగా కుప్పకూలారు. అప్రమత్తమైన అధికారులు గన్నవరం ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సాయంత్రం తర్వాత ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

నది ఒడ్డున మృతదేహం గుర్తింపు
పెనమలూరు, న్యూస్‌టుడే: చోడవరం వద్ద కృష్ణానది లంకల్లో వ్యక్తి (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నది ఒడ్డున లభ్యమైన మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం పెనమలూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతి చెంది వారం రోజులై ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం గుర్తించలేని స్థితిలో ఉండగా.. మృతుడి ఒంటిపై నలుపురంగు ప్యాంటు, బ్లూ రంగు షర్టు ఉన్నాయి. మృతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి ..
హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వేలేరు వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఒకరు మృతి చెందిన ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సుమారు 55 సంవత్సరాల వయసున్న అతడు అచేతనంగా పడి ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై జనార్దన్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి ఒంటిపై గోధుమ రంగు చారల చొక్కా, ఎర్ర నిక్కరు ఉన్నాయని, మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపర్చినట్లు ఎస్సై చెప్పారు.

బైక్‌ను ఢీకొన్న కారు: ఒకరికి తీవ్ర గాయాలు
గన్నవరం గ్రామీణం: గన్నవరం మండలం కేసరపల్లిలో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. తాడేపల్లిగూడెం నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న కారు.. ఎదురుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో కేసరపల్లి గ్రామానికి చెందిన రైతు పావులూరి రామారావుకు తీవ్ర గాయాలు కాగా విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంతుచూస్తానని బెదిరించిన యువకుడిపై కేసు
పెనమలూరు, న్యూస్‌టుడే: ‘మీ కుమార్తెను ప్రేమించా.. ఇచ్చి పెళ్లి చేయకపోతే అంతుచూస్తా’ అని ఓ యువతి తల్లిని బెదిరిస్తున్న యువకుడిపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకాని లక్ష్మణరావు యనమలకుదురు ఇందిరానగర్ నివాసి. అతడు అదే గ్రామానికి చెందిన ఓ యువతి వెంటపడుతూ ప్రేమిస్తున్నానంటూ వేధించడం మొదలుపెట్టాడు. ఆ యువతి తల్లిదండ్రులకు తెలుపగా వారు లక్ష్మణరావును మందలించారు. ఈ నెల 16న తల్లీకుమార్తె బయటకు వెళ్లి వస్తుండగా దారిలో ఆ యువకుడు అడ్డగించి బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శుక్రవారం పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు
హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కాకులపాడుకు చెందిన ఓ వ్యక్తి తప్పిపోయిన ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. అతడికి మతి స్థిమితం సరిగా లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారని, ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

ప్రకటన
మా క్లయింటు కృష్ణా జిల్లా, కానూరు గ్రామ కాపురస్థులు చింతా శివ ప్రసాద్ గారి కుమారుడు చింతా ముఖేష్ గారి సంజాయిషీ పొంది తెలియచేయునది ఏమనగా కృష్ణా జిల్లా, కానూరు గ్రామ కాపురస్తులు కలకోట గోపిరెడ్డి గారి కుమారుడు కలకోట శ్రీనివాసరెడ్డి గారు, ది. 22.08.2012వ తేదీన కొల్లి రామ్‌గోపాల్ గారి కుమారుడు కొల్లి కళ్యాణచక్రవర్తి గారి వలన క్రయం పొంది శ్రీ పటమట సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, దస్తావేజు నెం. 6233/2012రుగా రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు రీత్యా వారికి సంక్రమించి ఆ తదాది నేటి వరకు వారికి మాత్రమే సర్వ సంపూర్ణ స్వాధీన యాజమాన్య హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు. సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిని మా క్లయింటు క్రయమును పొందుటకు విక్రయ ఒప్పందము కుదుర్చుకుని కొంత సొమ్ము బయానాగా చెల్లించి త్వరలో మా క్లయింటు పేరుగాని, వారు కోరిన వారి పేరున గాని రిజిష్టరు దస్తావేజును వ్రాసుకొనబోవుచున్నారు. కావున యీ దిగువ షెడ్యూలు దాఖలాస్తిపై ఎవ్వరికి ఎట్టి ఆక్షేపణలు, క్లయిమ్లు, మైనరు హక్కులు, వారసత్వపు హక్కులు వగైరాలు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ లగాయతు 10 రోజుల లోపల చేరునట్లుగా ఎక్నాలెడ్జిమెంట్ గల రిజిష్టరు పోస్టుద్వారా మా చిరునామాకు తెలియపరచవలసినది. అట్లు గడువు తేదీలోపు ఎట్టి అభ్యంతరములు, ఆక్షేపణలు వగైరాలు రానియెడల దిగువ షెడ్యూలు దాఖలాస్తి నిర్వివాదమైన ఆస్తిగా పరిగణించి మా క్లయింటు క్రయమును పొందుదురు. గడువుతేదీ దాటి వచ్చు ఎట్టి క్లయిమ్లు, ఛార్జీలు, అభ్యంతరములు, అక్షేపణలు వగైరాలు మా క్లయింటును బద్ధులను చేయజాలవని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.
ఎ-షెడ్యూలు: కృష్ణా జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, శ్రీ పటమట సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో చేరిన, పెనమలూరు మండలం, వై.యస్.ఆర్ తాడిగడప మున్సిపల్ ఏరియాలో చేరిన కానూరు గ్రామ పంచాయతీ ఏరియా కానూరు గ్రామ రీ. సర్వే నెం. 221/1ఎ, 221/1 ర్లు దాఖలా చ.గ. 1080ల నివేశన స్థలముకు **హద్దులు: తూర్పు :** పంచాయతీ రోడ్డు, **దక్షిణం:** పంచాయతీ రోడ్డు, **పడమర :** పంచాయతీ రోడ్డు, **ఉత్తరం:** సంగా శివ నాగేశ్వరరావు గారి ఆస్తి.
యీ హద్దుల మధ్య గల చ.గ.1080లు లేక చ.మీ. 903.018ర్లలో అనిర్దిష్టపు జాయింటు హక్కు గల చ.గ.39.0లు లేక చ.మీ. 32.609 ర్లలో స్థిరాస్తియున్నూ.
బి-షెడ్యూలు: ఎ-షెడ్యూలు దాఖలా స్థలములో నిర్మాణము చేయబడిన వసంత్ గోపాల్ అను నామధేయము గల అపార్టుమెంటులో ఫోర్తు ఫ్లోరు ఫ్లాటు నెం. 505 రు దాఖలా చ.గ. 860.0లు ప్లింతేరియా, చ.అ. 50.0 లు కామన్ ఏరియా, మరియు చ.అ.60.0లు కారు పార్కింగు మరియు యావత్తు ఈజ్మెంటు హక్కులతో వున్న ఫ్లాటుకు **హద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** స్టెయిర్ కేస్ మరియు కారిడార్.
ఇట్లు, **యలమంచిలి రామకృష్ణ**
యలమంచిలి యశస్విని పద్మావతి
న్యాయవాదులు, షాపు నెం. 10, రాధాకృష్ణ రెసిడెన్సీ, న్యూ ఆర్.టీ.సి. కాలనీ
పటమట, విజయవాడ – 7 ఫోన్ నెం: **94946 23679, 99594 54322**
విజయవాడ, తేదీ: 18-10-2024

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
హోమ్ లోన్ సెంటర్-1 (ఆర్‌ఏసిపిసి-1)-05252, కె.కె.టవర్స్, మొదటి అంతస్థు, యం.జి.రోడ్డు, విజయవాడ-520 010, యన్‌టిఆర్ జిల్లా.

డిమాండ్ నోటీసు
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని 13(2) క్రింద దిగువ వారికి
టు
శ్రీ గుట్టా తారక రాజేంద్ర ప్రసాద్ మరియు శ్రీ గుట్టా రామకృష్ణ
డోర్ నెం.15-183, ప్లాట్ నెం.9, నారాయణపురం కాలని, పోరంకి, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా.
అకౌంట్ నెం.62294512830-ఎడ్యుకేషనల్ లోన్
సార్ / మేడమ్,
మీరు పటమటలంక బ్రాంచి-20542, విజయవాడ-520 010, యన్‌టిఆర్ జిల్లా నుండి ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తిని తనఖా ఉంచి ఎడ్యుకేషనల్ లోన్ సౌకర్యాన్ని పొందియున్నారు. సదరు ఋణము **ది.11-10-2024వ** తేదీ నాటికి మొత్తము బకాయి **రూ.2,23,784/- (అక్షరాల రెండులక్షల ఇరవైమూడువేల ఏడువందల ఎనభైనాలుగు రూపాయిలు మాత్రమే)** మరియు ఒప్పందపరమైన వడ్డీ తదుపరి కాస్ట్స్, ఛార్జీలు, ఇతరములైన ఖర్చులు మొత్తము బకాయిగా ఉన్నవి.
తనఖాపెట్టిన స్థిరాస్థి వివరము
కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, పోరంకి గ్రామం, నారాయణపురం కాలని, 1వ రోడ్డు, డోర్ నెం.15-183, లేఅవుట్ నెం.11/2002, ప్లాట్ నెం.9, ఆర్‌యస్ నెం.18/3లోని 230 చ॥గ॥ల విస్తీర్ణములో నిర్మించిన ఆర్‌సిసి రూఫ్ నివాస భవనము శ్రీ గుట్టా రామకృష్ణ, తండ్రి: జి.వి. సుబ్బారావు గారికి చెందిన డాక్యుమెంట్ నెం.293/2003, తేది:03-02-2003. **హద్దులు: తూర్పు:** 40 అడుగుల వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నెం.10, **పడమర:** శ్రీ తోటకూర వీరయ్య మరియు ఇతరుల భూమి, **ఉత్తరం:** ప్లాట్ నెం.8.
శ్రీ గుట్టా తారక రాజేంద్ర ప్రసాద్ మరియు శ్రీ గుట్టా రామకృష్ణ మీకు బ్యాంకు వారు మంజూరు చేసిన ఋణసౌకర్యం నిమిత్తం పైన ఉదహరించిన స్థిరాస్తి తనఖా ఉంచినారు. పైన పేర్కొనబడిన చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద **ది.11-10-2024వ తేదీన డిమాండ్ నోటీసును** బ్యాంకుచే మీకు జారీచేయడమైనది. కానీ జారీ చేసిన నోటీసును ఋణగ్రహీత/(లు) స్వీకరించనందున **ఈ పత్రికా ప్రకటన జారీచేయడమైనది.** బ్యాంకు వారు జారీచేసిన షరతులు మరియు నిబంధనలు పాటించుటలో మీరు విఫలమైనందున ఖాతా క్రమము తప్పి ఆర్.బి.ఐ మార్గదర్శకాల ప్రకారం ది.28-09-2024 న ఎన్.పి.ఎగా (మొండిబకాయి) వర్గీకరించబడినది. సదరు పైన తెలిపిన ఋణమొత్తము మరియు ఒప్పందపరమైన వడ్డీ ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 దినములలో తిరిగి చెల్లించవలసినదిగా మిమ్మల్ని కోరడమైనది. లేనియెడల ఎటువంటి తదుపరి ప్రకటన లేకుండా సెక్షన్ 13(4) క్రింద పైన తెలిపిన సెక్యూరిటీపై SARFAESI చట్టం, 2002 లోని నిబంధనలు అమలు చేసేందుకు, చర్యలు చేపట్టుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అగు దిగువ సంతకందారునకు అధికారం కలదు. ఉద్దేశించబడిన చట్టంలో మరియు లేదా అమలులో ఉన్న ఏ చట్టం క్రింద మాకు లభించే ఏ ఇతర హక్కులకు భంగం కలుగకుండా ఇవి జారీచేయడమైనది.
తేది : 18-10-2024 **అధీకృత అధికారి**
ప్రదేశం: విజయవాడ **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

(c) eenadu



తొమ్మిది పతకాల ఎంబీబీఎస్

'డబ్బు తీసుకోకుండా వైద్యం చేసి, మా ప్రాణాలు కాపాడారు. మీరు చల్లగా ఉండాలమ్మా' అంటూ వైద్యురాలైన తన తల్లితో ఓ పేద మహిళ చెప్పింది. అది చూసి 'నేనూ డాక్టరు కావాలి' అనుకున్నాడు **అత్తలూరి సాయి అనిరుధ్.** 'ఆ వృత్తికి వేళాపాళలుండవు. ప్రయాస ఎక్కువ' అని, దగ్గరివాళ్లు చెప్పినా వినలేదు. ఏకంగా తొమ్మిది బంగారు పతకాలతో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు.

టాపర్ కావడం అంటే మాటలు కాదు. ముందు చదువుపై విపరీతమైన ఇష్టం ఉండాలి. తీవ్రమైన పోటీ ఎదుర్కోవాలి. అయితే కాకినాడ కుర్రాడు అనిరుధ్ మాత్రం దీనికోసం మరీ త్యాగాలేం చేయలేదు. తనకున్న స్నేహితులంతా చదువు, సబ్జెక్టుపై ప్రాణం పెట్టేవాళ్లే. అదీగాక అనిరుధ్ సీనియర్ ప్రొఫెసర్లు, ఆయా సబ్జెక్టుల నిపుణులతో ఎక్కువగా సావాసం చేసేవాడు. ఏ సందేహాలున్నా అడిగిమరీ తీర్చుకునేవాడు. డా.కాకర్ల సుబ్బారావు, డా.కిమ్ రామస్వామిలాంటి దిగ్గజ వైద్యుల సలహాలు తీసుకునేవాడు. తల్లిదండ్రులిద్దరూ వైద్యులే. అప్పుడప్పుడు నాన్నతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తూ రోగుల ఇక్కట్లు గమనించేవాడు. పైగా తనకి గ్రాహకశక్తి ఎక్కువ. సహాధ్యాయుల తోనే కాకుండా ఇతర పాఠశాలలు, కాలేజీలు, ఇతర రాష్ట్రాల్లోని టాపర్లతోనూ పోటీ పడేవాడు. అదే ఊపుతో సీబీఎస్ఈలో పదోతరగతిలో పాఠశాల టాపర్‌గా నిలిచాడు. ఇంటర్‌లో తూర్పు గోదావరి జిల్లా ఫస్ట్ వచ్చాడు. ఎంబీబీఎస్‌లో అయితే తన ప్రతిభ శిఖరస్థాయికి చేరింది. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్‌లలో విశ్వవిద్యాలయ పరిధిలో మేటిగా నిలవడమే కాదు.. తొమ్మిది పసిడి పతకాలతో ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం టాపర్ అయ్యాడు. ప్రస్తుతం హౌస్‌సర్జన్ శిక్షణలో ఉన్న అనిరుధ్ న్యూరో సర్జన్ లేదా గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌గా మారి, పేదలకు చేతనైన సాయం చేస్తాను అంటున్నాడు.

- చిరంజీవులు కరిమి, కాకినాడ

- మంగళగిరి అఖిల భారత వైద్య విజ్ఞాన శాస్త్రాల సంస్థ (ఎయిమ్స్)లో కొలక్విమ్-2020 సదస్సులో స్వర్ణం.
- విశాఖపట్నం ఆంధ్ర వైద్య కళాశాల జాతీయస్థాయి అనాటమీ సెమినార్‌లో గోల్డ్ మెడల్.
- ఉస్మానియా వైద్య కళాశాల హైదరాబాద్‌లో నిర్వహించిన దేశవ్యాప్త యూజీ కాన్ఫరెన్స్ ఓస్మెకాన్- 2021 పత్ర సమర్పణలో మొదటి బహుమతి.
- వైద్యశాస్త్రంలో చాట్ జీపీటీ, ఇతర ఏఐ వ్యవస్థల ప్రభావం, వాటి సవాళ్లపై రాసిన విశ్లేషణ ప్రఖ్యాత జాన్స్ హాప్కిన్స్ మ్యాగజైన్‌లో సమీక్షించారు. ఫ్రంటియర్స్ ఇన్ ఏఐ జర్నల్‌లో ప్రచురితమైంది.

'సిమ్మర్ డేటింగ్' తరం!



చాటింగూ.. డేటింగూ.. నచ్చితేనే వెడ్డింగూ.. లేదంటే రిలేషన్ షిప్‌కి ఎండింగూ.. ఇప్పుడిదే కదా ట్రెండింగూ! కానీ, జనరేషన్ జెడ్ మాత్రం తాము అలా కాదంటోంది. నేరుగా రొమాన్స్‌లోకి దిగిపోకుండా ఎమోషనల్‌గా కనెక్ట్ కావడమే ముఖ్యమంటోంది. దీన్నే 'సిమ్మర్ డేటింగ్' అంటున్నారు. మెట్రో, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఇటీవల ఓ డేటింగ్ యాప్ చేసిన సర్వేలో దాదాపు 47శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారట. పరిచయం కాగానే డిన్నర్లూ, టూర్లూ అనకుండా.. ఒకరినొకరు అర్థం చేసుకునేందుకు, ఓపికగా తగిన సమయం తీసుకుంటున్నారట. అభిరుచులు కలిసి, నమ్మకం కుదిరి, తమకు సరిజోడు అనుకున్నాకే ముందడుగు వేస్తున్నామని సెలవిచ్చారు. కొద్దిరోజుల్లో ముగిసిపోయే బంధం కంటే మనసుతో ముడిపడి, ఎక్కువ కాలం నిలిచే అనుబంధాలకే ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఆకర్షణతో వచ్చే ఇన్‌స్టంట్ కెమిస్ట్రీ వద్దనీ.. భాగస్వామిపై నమ్మకం కుదిరాకే డేటింగ్‌కి ఓకే చెబుతున్నారు.

ఐదు కొలువుల విజేత

'అంత చదువూ చదివి టీకొట్టు పెట్టుకొని బతుకుతావా?' అంటూ ఎగతాళి చేశారెందరో. కానీ కాలం కలిసిరానప్పుడు తగ్గి ఉండటంలో తప్పు లేదని భావించాడు **ఉడాన్ శివమహేశ్ కుమార్.** తర్వాత ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. అప్పుడు చులకనగా చూసినవాళ్లే ఇప్పుడు 'శెభాష్' అంటున్నారు.



పెద్దపల్లి జిల్లా ధర్మారంలో శివమహేశ్ కుమార్ పేరు ఆరునెలల నుంచి మార్మోగిపోతోంది. ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనమైన ఈ రోజుల్లో తను వరుసపెట్టి సర్కారీ కొలువులు కొడుతూనే ఉన్నాడు. గతేడాది గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో అతడి విజయయాత్ర మొదలైంది. టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్.. తాజాగా డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించి జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. మహేశ్‌కి మొదట్నుంచీ హిందీ సబ్జెక్టు అంటే విపరీతమైన ఆసక్తి. దాంతో ఎం.ఎ. హిందీ చదివి, హిందీ పండిత్ శిక్షణ కూడా పూర్తి చేశాడు. మూడేళ్లు ప్రైవేటు పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేశాడు. కానీ అత్తెసరు జీతం కావడంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదల మొదలైంది. సాయంత్రం దాకా విధులు నిర్వర్తించి, అర్ధరాత్రి వరకు టీచరు ఉద్యోగానికి సిద్ధమయ్యేవాడు. అలా సన్నద్ధమవుతూనే 2017లో డీఎస్సీ రాశాడు. జిల్లాస్థాయిలో రెండో ర్యాంకుతో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైనా, కోర్టు కేసుల కారణంగా ప్రభుత్వం నియామకాలు జరపలేదు. అయినా అధైర్య పడకుండా ఇతర ఉద్యోగాల కోసం సాధన ప్రారంభించాడు.

ఓ మోస్తరుగా గడిచి పోతున్న అతడి జీవితాన్ని కరోనా అతలాకుతలం చేసింది. పని చేస్తున్న స్కూల్ మూతపడటంతో ఉపాధి కరవైంది. దాంతో కుటుంబం గడవడానికి పక్క ఊరిలో చాయ్ దుకాణం తెరిచాడు. అప్పుడు చాలామంది రకరకాలుగా మాట్లాడారు. అయినా అదేమీ పట్టించుకోలేదు. సాయంత్రం వరకు టీపాయింట్ నడిపి, ఆ తర్వాత చదువుకునేవాడు. ఆపై ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటన రావడంతో 2023 జనవరిలో కరీంనగర్ వెళ్లాడు. డబ్బులకు ఇబ్బంది ఉండటంతో మిత్రుడి గదిలో ఉంటూ, ఐదు రూపాయల భోజనంతో సరిపెట్టుకుంటూ ప్రిపేర్ అయ్యేవాడు. తర్వాత తను రాసిన ప్రతి పరీక్షలోనూ విజయం సాధించాడు. ప్రస్తుతం జూనియర్ లెక్చరర్ కొలువులో చేరినా, గ్రూప్-1 ఉద్యోగమే తన లక్ష్యమంటున్నాడు.

- చల్లారం రామచంద్రారెడ్డి, కరీంనగర్ డెస్క్


ఈతరం

■ youthpage@eenadu.in

గొడవ పడటమే హీరోయిజమా?

నేనొక అమ్మాయిని ప్రేమించా. ఏడాది వరకు బాగానే ఉంది. ఈమధ్యే విచిత్రంగా ప్రవర్తిస్తోంది. బైక్‌పై విన్యాసాలు చేస్తూ రీల్స్ చేద్దాం అంటోంది. కావాలనే వేరే అబ్బాయిలను రెచ్చగొడుతోంది. వాళ్లు తనని ఏమైనా కామెంట్ చేస్తే, నేను వెళ్లి వాళ్లని చితక్కొట్టాలట! అలా చేయకపోతే 'నీకేదీ చేతకాదు.. హీరో లక్షణం ఒక్కటీ లేద'ని దెప్పి పొడుస్తోంది. దుస్సాహసాలు, అనవసర గొడవలకు వెళ్లకుండా ఉంటే చేతకానితనమా? తనకెలా చెప్పాలి?

- రాజ్, ఈమెయిల్



ఏడాది క్రితం వరకు బాగానే ఉన్న అమ్మాయిలో ఒక్కసారిగా మార్పు రావడానికి కారణమేంటో తెలుసుకున్నారా? బైక్‌పై వెళ్తూ రీల్స్ చేయాలనడం, ఇతరులతో గొడవ కోరుకోవడం ఆమెలో మానసిక పరిణతి లేదనే విషయం సూచిస్తోంది. ఆమె ఊహా లోకంలో విహరిస్తోంది. ఇంతకీ తన వయసెంతో చెప్పలేదు. సామాజిక మాధ్యమాల అతి వాడకం, స్నేహితుల ప్రభావం కారణంగా బహుశా తను అలా ప్రవర్తిస్తూ ఉండొచ్చు. తన స్నేహితుల్లో ఈ తరహా మనస్తత్వం ఉన్నవాళ్లకి దూరంగా ఉంచండి. ఇలాంటి పిచ్చి ఆలోచనలు రాకుండా.. తనకి ఎప్పుడూ ఏదో ఒక వ్యాపకం ఉండేలా జాగ్రత్త పడాలి. ప్రమాదకరమైన రీల్స్ చేస్తూ కొంతమంది ప్రాణాలు కోల్పోవడం చూస్తూనే ఉన్నాం. ఇలా చేస్తే చట్టపరంగానూ చిక్కుల్లో పడతారు. ఈ విషయం తనకి అర్థమయ్యేలా చెప్పండి. ఇక ఇతరులతో గొడవ పడటం హీరోయిజం కాదు. దీన్ని ఎవరూ హర్షించరు. ఇవన్నీ చెప్పినా కూడా ఆ అమ్మాయి మారకపోతే తనకి దూరంగా ఉండటమే మంచిది. దుస్సాహసాలు, గొడవలతో అనవసరంగా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. ఆల్ ది బెస్ట్.



- డా.అర్చన నండూరి, క్లినికల్ సైకాలజిస్ట్

సొగసరి.. ఈవీహికిల్!

ఇప్పుడిప్పుడే ఈవీ బైక్‌ల హవా మొదలవుతోంది. సరికొత్త ఫీచర్లు, అదిరిపోయే డిజైన్‌తో కుర్రకారును ఆకట్టుకునేలా మోడళ్లను విపణిలోకి దించుతున్నాయి తయారీ కంపెనీలు. ఆ వరుసలోనే వచ్చింది 'టీ 30'.



చెన్నైకి చెందిన రాప్టీ.హెచ్‌వీ అనే స్టార్టప్ దీన్ని తయారు చేసింది. పెట్రోల్‌తో నడిచే 250-300 సీసీ బైక్‌లతో పోటీ పడగల సామర్థ్యం దీని సొంతమంటోంది. దీన్ని దేశంలోనే హైవోల్టేజీ ఈవీగా పేర్కొంటోంది.

- ఎలక్ట్రిక్ కార్లలో ఉపయోగించే శక్తిమంతమైన బ్యాటరీని ఈ బైక్‌కి అమర్చారు. కార్ల ఛార్జింగ్ స్టేషన్లలో రీఛార్జ్ చేసుకోవచ్చు. 5.4 కేడబ్ల్యూహెచ్ సామర్థ్యం ఉండే ఈ బ్యాటరీని ఛార్జ్ చేసి, 150 కిలోమీటర్లు ప్రయాణం చేయొచ్చు.
- 3.5 సెకన్లలో బండి 60 కిలోమీటర్ల వేగం అందుకుంటుంది. ఐపీ-67 రేటెడ్ బ్యాటరీ ప్యాక్‌కి ఎనిమిదేళ్లు లేదా 80 వేల కిలోమీటర్ల వరకూ వారంటీని ఇస్తున్నారు.
- ధర రూ.2.39 లక్షలు (ఎక్స్ షోరూం).

కిరాయి డ్రైవర్ నుంచి గంజాయి స్మగ్లర్‌గా మారి..

వెంట తెచ్చుకున్న లోడ్ చేసిన తుపాకీ

ముఠాని పట్టుకున్న పోలీసులు



గంజాయి ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకీ, బుల్లెట్లు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ మహేశ్వరరాజు, సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్, పటమట సీఐ పవన్ కిషోర్

పటమట, న్యూస్‌టుడే: అంతర్ రాష్ట్ర ముఠా లోడ్ చేసిన తుపాకీ వెంట తెచ్చుకొని గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు చిక్కింది. పోలీసుల కంట పడకుండా నర్సీపట్నం నుంచి విజయవాడ మీదుగా చెన్నైకి పలుమార్లు గంజాయి తీసుకెళ్తున్న ముఠాని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. ఆ వివరాలను శుక్రవారం విజయవాడ పటమట పోలీస్ స్టేషన్‌లో డీసీపీ మహేశ్వరరాజు, సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిషోర్ మీడియాకు వెల్లడించారు. చెన్నై పద్మనాభనగర్‌కు చెందిన రమేష్ వినేష్ కుమార్‌కు అదే నగరానికి చెందిన గంజాయి వ్యాపారి శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన గంజాయి వ్యాపారి దుర్గా నుంచి శ్రీనివాస్ సరకు తెప్పించి చెన్నైలో విక్రయిస్తుంటాడు. తుని నుంచి చెన్నైకి గంజాయి తీసుకెళ్తే... వినేష్‌కు రూ.25 వేలు ఇచ్చేలా ఇద్దరూ ఒప్పందం చేసుకున్నారు. దుర్గా నర్సీపట్నంలో వినేష్ వాహనంలో సరకు ఎక్కించేవాడు. అలా పలుమార్లు గంజాయి తీసుకెళ్లాడు. గతేడాది పోలీసులకు దొరికాడు. దుర్గాతో పాటు వినేష్ జైలు శిక్ష అనుభవించాడు.

నంబర్ ప్లేట్లు మార్చి..

కిరాయి డ్రైవర్‌గా గంజాయి చేరవేసే కంటే తానే స్మగ్లింగ్ చేస్తే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే ఆలోచనతో వినేష్ కారు కొన్నాడు. పలుమార్లు గంజాయి చెన్నైకి తీసుకెళ్లాడు. ఈ నెల 16న తమిళనాడుకు చెందిన కుమారన్ మరిమూర్తితో కలిసి వినేష్ చెన్నై నుంచి కారులో తుని వచ్చాడు. గురువారం దుర్గా తీసుకువచ్చిన 150 కిలోల గంజాయిని తన కారులో లోడ్ చేసుకున్నాడు. కారుకు ఏపీ నంబర్ ప్లేట్ అతికించాడు. విషయం తెలుసుకున్న కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు విజయవాడ సీపీకి సమాచారం ఇచ్చారు. ఆయన ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఆ బృందం విజయవాడలో వాహనాన్ని పట్టుకొని సరకుతో పాటు లోడ్ చేసిన తుపాకీ స్వాధీనం చేసుకుంది.

బిహార్‌లో తుపాకీ కొని..

వినేష్ తరచూ బెంగళూరు వెళ్లేవాడు. బిహార్‌కు చెందిన ధర్మచంద్‌తో అతనికి పరిచయమైంది. అతని సహాయంతో పట్నా వెళ్లి అక్కడున్న సునీల్‌తో కలిసి రూ.75 వేలకు తుపాకీ కొన్నాడు. గతంలో వినేష్ ఇటుకల వ్యాపారం చేసేవాడు. భాగస్వాములతో గొడవలున్నాయి. వారు పలుమార్లు ఇతనిపై దాడి చేశారు. ఆ నేపథ్యంలో వినేష్ తుపాకీ వెంట తెచ్చుకున్నాడు. అయితే తుపాకీ లోడ్ చేసి ఉండటాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు.

అతిథులు మెచ్చేలా.. ఆహ్లాదం పంచేలా..

విజయవాడ విమానాశ్రయం జాతీయ రహదారికి కొత్త కళ

సుందరీకరణ పనులకు శంకుస్థాపన




సుందరీకరణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎండీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో కీలకం కానున్న విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విజయవాడ నగర శివారు రామవరప్పాడు వరకు పచ్చదనం నిండేలా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. 13 కిలోమీటర్ల మేర రెండేళ్ల వ్యవధితో రూ.6.48కోట్లతో ఏపీ గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రామవరప్పాడు నుంచి కేసరపల్లి వరకు జరుగుతున్న సుందరీకరణ పనులను మరో రూ.2 కోట్లతో గన్నవరం చిన్నఅవుటపల్లి వరకు విస్తరించనున్నారు. ఆ పనులకు గన్నవరం మండలం కేసరపల్లి ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల వద్ద శుక్రవారం కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డి, జీఎం దయాకర్‌బాబు, ఆర్కిటెక్ట్ సత్యనారాయణ, ఎన్‌హెచ్ఏఐ పీడీ శ్రీధర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విమానాశ్రయానికి ఎంతోమంది పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రముఖులు వస్తుంటారని వారిని ఆకర్షించడంతో పాటు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. తొలివిడత పనులను పదిహేను రోజుల్లో పూర్తిచేయనున్నట్లు చెప్పారు.

పారిశ్రామికవాడతో ఉపాధి అవకాశాలు..

మల్లవల్లి పారిశ్రామికవాడలో ఎకరా రూ.16.5 లక్షల చొప్పున ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయించేందుకు చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఏర్పాటయ్యే 426 పరిశ్రమలు 18 నెలల్లో యూనిట్ పనులు ప్రారంభించకుంటే భూములు వెనక్కి తీసుకునేందుకు ప్రభుత్వం వెనుకాడదన్నారు. పారిశ్రామికవాడ వృద్ధితో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని స్పష్టం చేశారు. విమానాశ్రయం ఎదుట ప్రభుత్వ భూమిలో ప్రముఖుల కోసం సర్కార్ అతిథిగృహాలు, కన్వెన్షన్ల నిర్మాణంపై సీఎంతో చర్చించినట్లు యార్లగడ్డ వెల్లడించారు. కార్యక్రమంలో వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ కిశోర్, డీపీవో అరుణ, పంచాయతీ, రెవెన్యూ అధికారులతో పాటు కిసాన్ మోర్చా రాష్ట్రాధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌నకు రాష్ట్ర బృందం



క్రీడాకారులతో రాష్ట్ర సంఘం కార్యదర్శి రామస్వామి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గోవాలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు జరిగే జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రం నుంచి 23 మంది పురుషులు, ముగ్గురు మహిళలతో కూడిన బృందం తలపడుతుందని రాష్ట్ర పారా స్పోర్ట్స్ సంఘం కార్యదర్శి వి.రామస్వామి తెలిపారు. పోటీకి వెళ్తున్న ప్రతి స్విమర్‌నూ శాప్ ఎండీ పీఎస్ గిరీషా, రాష్ట్ర పారా స్పోర్ట్స్ సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు అభినందించారు.

20న ఎస్‌జీఎఫ్ జిల్లా సైక్లింగ్ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ జిల్లా అండర్-19 శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నున్నలోని జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో బాలబాలికల సైక్లింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. పదో తరగతి ఒరిజినల్ మార్కుల జాబితాతో పాటు కళాశాల/ పాఠశాల ప్రిన్సిపల్/ ప్రధానోపాధ్యాయుడు సంతకం చేసిన స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 94401 12455 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఓపెన్ పది, ఇంటర్‌కు దరఖాస్తు గడువు 25

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా 2024-25 విద్యా సంవత్సరంలో ఓపెన్ పది, ఇంటర్‌లో చేరడానికి ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా సమన్వయకర్త ఎన్.బాబురావు తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 26 నుంచి 29 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 30 నుంచి 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

పరీక్షా ఫలితాల విడుదల

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: కృష్ణా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల పరిధిలోని డిగ్రీ కోర్సు వన్‌టైం ఆపర్చ్యునిటీ పరీక్షా ఫలితాలను ఉపకులపతి ఆర్.శ్రీనివాసరావు ఆదేశాలతో శుక్రవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.వీరబ్రహ్మచారి ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాలకు సంబంధించిన పూర్తి వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

టన్ను చెరకు ధర రూ.3,576

ఉయ్యూరు, న్యూస్‌టుడే: 2024-25 సీజన్‌కు గాను చెరకు ధర టన్నుకు రూ.3,576 ధర ఇస్తున్నట్లు కేసీపీ కర్మాగారం యూనిట్ హెడ్ యలమంచిలి సీతారామదాస్ అన్నారు. ఉయ్యూరులోని కర్మాగారంలో చెరకు రైతు సంఘం నాయకులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌కు రాయితీతో కలిపి టన్నుకు రూ.3,576, యాంత్రీకరణకు అనువుగా సాగుచేసిన రైతులకు సబ్సిడీతో కలిపి టన్నుకు రూ.3,676 చెల్లించనున్నట్లు వెల్లడించారు. గత నెలలో వచ్చిన అకాల వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతులకు చెరకు రైతు సంఘం విజ్ఞప్తి మేరకు రూ.40.89 లక్షలు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. రానున్న సీజన్‌కు ఈ సంవత్సరం నవంబరు నుంచి 2025 సంవత్సరం ఫిబ్రవరి వరకు నాటే చెరకు మొక్క తోటలకు ఎకరానికి రూ.10 వేలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. సబ్సిడీతో పాటు సంప్రదాయ పద్ధతుల్లో నాటిన చెరకు తోటలకు టన్నుకు రూ.400 లేదా యాంత్రీకరణ అనువుగా వేసిన తోటలకు టన్నుకు రూ.500 సబ్సిడీగా ప్రకటించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగాల పేరుతో మోసం

భవానీపురం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ముగ్గురు వ్యక్తులు తమను మోసం చేశారంటూ బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి...భవానీపురానికి చెందిన అహ్మద్, వెంకటరమణ, మరో వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ తమ వద్ద రూ.30 లక్షలు పైగా వసూలు చేసినట్లుగా బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు తీసుకుని ఎంతకీ సమాధానం చెప్పకపోవడంతో నిందితులను శుక్రవారం రాత్రి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై భవానీపురం పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



హైజంప్‌లో క్రీడాకారుడు



హర్డిల్స్‌లో సత్తా చాటుతూ..

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం 32 పతకాలతో తమిళనాడు అగ్రస్థానంలో, తరవాత స్థానంలో కర్ణాటక ఉంది. ఆతిథ్య జట్టు 8 పతకాలు సాధించింది. తెలంగాణ 10 పతకాలతో రాణించింది. ★ అండర్-20 పురుషుల 200 మీటర్ల పరుగు పందెంలో ఏపీ క్రీడాకారుడు శెట్టి లోహిత్ మూడో స్థానంలో నిలిచారు. ఇదే విభాగంలో 3వేల పరుగుపందెం పోటీలో చంద్రశేఖర్ ప్రసాద్ బంగారు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. డిస్కస్ త్రోలో వికాస దాసరి రెండో స్థానంలో నిలిచారు. 400 మీటర్ల రిలే పరుగు పందెంలో తెలంగాణ క్రీడాకారులు రెండో స్థానంలో నిలవగా..ఏపీ మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇదే విభాగంలో మహిళల 400 మీటర్ల రిలే పరుగు పందెంలో ఏపీ క్రీడాకారిణులు మూడో స్థానంలో నిలిచారు. ★ అండర్ 18 పురుషుల విభాగం 200 మీటర్ల పరుగు పందెంలో శేష దుడ్డు, 1000 మీటర్ల పరుగుపందెంలో వెంకటరత్నం రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారు. తెలంగాణకు చెందిన మహేష్ రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అండర్ -18 మహిళల హెప్టథ్లాన్ పోటీలో తెలంగాణ క్రీడాకారిణి శ్రీతేజ మొదటి స్థానం, అండర్-16 బాలుర విభాగం 600మీటర్ల పరుగు పందెంలో మస్తాన్ రెండో స్థానం, ఇదే విభాగంలో 80 మీటర్ల హర్డిల్స్‌లో ఏపీ, తెలంగాణ క్రీడాకారులు మూడు పతకాలను సాధించారు. ఏపీకి చెందిన ధనుష్ తేజా మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా మిగిలిన రెండు స్థానాలలో తెలంగాణకు చెందిన సయ్యద్ తాజీం, అన్షు యాదవ్ నిలిచారు. ఇదే విభాగంలో బాలికల లాంగ్ జంప్‌లో వైశాలి మొదటి స్థానం సాధించారు. అండర్-14 బాలుర విభాగంలో నిర్వహించిన ట్రైథ్లాన్‌లో తెలంగాణ క్రీడాకారుడు రాథోడ్ కార్తీక్ మొదటి, ఏపీ క్రీడాకారుడు ధనుష్ రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

అంతర్జాతీయ ఓపెన్ చెస్ విజేత లలిత్‌బాబు



విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: థాయ్‌లాండ్‌లో ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు జరిగిన పట్టాయ శ్రీరచా ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్-2024లో నగరానికి చెందిన గ్రాండ్ మాస్టర్ ముసునూరి రోహిత్ లలిత్‌బాబు విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకున్నాడు. తొమ్మిది రౌండ్లకుగాను ఏడు పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో ఈజిప్టు దేశానికి చెందిన ఒక జీఎం (గ్రాండ్ మాస్టర్), ఇద్దరు ఐఎం (ఇంటర్నేషనల్ మాస్టర్), ఒక సీఎం (కాండిడేట్ మాస్టర్)తో డ్రా చేసుకోగా.. అయిదుగురు క్రీడాకారులపై విజయం సాధించి మొత్తం ఏడు పాయింట్లతో విజేతగా నిలిచాడు.

(c) eenadu